### ఆసుపత్రిలో అరుదైన చికిత్స
## మహిళ కడుపులో అండాశయ తిత్తి తొలగింపు

**రామచంద్రాపురం, జూన్ 27, ప్రభాతవార్త:** మహిళ కడుపు నుంచి అండాశయ తిత్తిని మెడికవర్ వైద్యులు తొలగించారు. ఇందుకు సంబంధించి బాధితులు, వైద్యుల కథనం ప్రకారం... నడవలేని స్థితిలో పొత్తి కడుపు పెద్దగా మారడంలాంటి సమస్యతో ఓ మహిళ(40) రామచంద్రాపురం పట్టణం లోని అశోక్‌నగర్‌లోని మెడికవర్ ఆసుపత్రికి చేరుకోగా ఆసుపత్రి వర్గాలు మహిళకు స్కానింగ్ చేసి పొత్తి కడుపు నుంచి బొడ్డు ప్రాంతం వరకు పెద్ద తిత్తి (సిస్ట్) ఉన్నట్లుగా గుర్తించినట్లు గైనకాలజిస్ట్ డాక్టర్ మిధున కెఎస్ తెలిపారు. ఓపెన్ సర్జరీ చేసి టోటో పద్దతిలో తిత్తిని తొలగించామన్నారు. తొలగించిన తిత్తి 10 కిలోల బరువు ఉందన్నారు. ఓపెన్ సర్జరీ ద్వార 45 నిమిషాల్లో తిత్తిని తొలగించామన్నారు. గతంతో తమ ఆసుపత్రిలో 15 సెంటీమీటర్ల తిత్తిని తొలగించామని, ఈ మారు తొలగించిన తిత్తి పరిమాణం అంతకంటే అతపెద్దదిగా ఉందన్నారు. మహిళలు కాస్త కడుపు నొప్పి ఉండి పీరియడ్స్ సక్రమంగా ఉంటే సమస్యలను గుర్తించరని, అది కాస్త క్యాన్సర్‌గా మారే అవకాశాలు ఉంటాయని, అందుకు మహిళలు తగు జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ మిధున సూచించారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## పెద్దారెడ్డిపేటలో నేత్రపర్వంగా సీతారాముల కళ్యాణం

**పుల్కల్, జూన్ 27, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దారెడ్డిపేటలో వెలిసిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని గురువారం భక్తి శ్రద్దలతో నేత్రపర్వంగా జరుపుకున్నారు. ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 108 కలశాలతో లక్ష్మణ సమేత సీతారాముల వారికి అభిషేకం నిర్వహించి లక్ష పుష్పాలతో అర్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జోగిపేటకు చెందిన శ్యామ్ ప్రసాద్ దంపతులు వేద బ్రాహ్మణులు వేద మంత్రాలు వల్లిస్తుండగా సీతారాముల కళ్యాణోత్సవాన్ని జరిపించారు. ఉత్సవాలకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు మంతుర్ దుర్గయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యాదగిరిరెడ్డి, అంజయ్య, ఆనంతం, సుభాష్ చందర్, రమేష్ పాటిల్, సుభాష్, మల్లేశం, ఆంజనేయులు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సిపి అనురాధ

## విధి నిర్వహణలో అలసత్వం వద్దు
### సిపి అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** గంజాయి ఇతర మత్తు పదార్థాలు, పేకాట, జూదం తదతర వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఉక్కు పాదంతో అణిచివేయాలని సీపీ డా॥ అనురాధ అదేశించారు. గురువారం సీపీ కార్యాలయ ంలో పెండింగ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళ రక్షణకు పెద్దపీట వేయాలన్నారు. ప్రతి అధికారి నిజాయితీగా విధులు నిర్వహించాలని..విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దన్నారు. పెండింగ్‌లో ఉన్న చోరీ కేసులను టెక్నాలజీ అన్ని కోణాలలో పరిశోధన చేసి చేధించాలని సూచించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రతి దరఖాస్తుపై ఎలాంటి జాప్యంలేకుండా విచారణ చేసి బాధితులకు న్యాయంచేయలన్నారు. పెండింగ్ కేసులను పరిష్కరించాలన్నారు. గంజాయి రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తరచూ దొంగతనాలకు పాల్పడే అలవాటుపడ్డ నేరస్తులపై సస్పెక్ట్ షీట్స్ ఓపెన్ చేయాలని అదేశించారు. కేసుల్లో శిక్షల శాతం పెంచాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరాలు జరగకుండా చూడాలన్నారు. ప్రతి అధికారి పారదర్శకంగా విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో పోలీసు అధికారులు మల్లారెడ్డి, మధు, పురుషోత్తంరెడ్డి, సతీష్, శ్రీనివాస్, రవీందర్, సుమన్‌కుమార్, కిరణ్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## ఎంపిపి కీర్తిసురేష్‌కు ఘన సత్కారం



ఎంపిపిని సన్మానిస్తున్న దృశ్యం

**కొహేడ, జూన్ 27, ప్రభాతవార్త:** ఎంపిపి పదవి కాలం ముగుస్తుండడంతో సిద్దిపేటలో గురువారం నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపిపి కొక్కుల కీర్తిసురేష్‌ను రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మాజీ మ ంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు శాలువా, మెమోంటోతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జడ్పీ చైర్మన్ రోజాశర్మ, వైస్ చైర్మన్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గ్రామ పంచాయతిలో జరిగిన
## అవకతవకలపై డిఎల్‌పివో విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో మల్లికార్జున్‌రెడ్డి

**చేర్యాల, జూన్ 27, ప్రభాతవార్త:** పోతిరెడ్డిపల్లి గ్రామపంచాయతీలో డబ్బుల అవకతవలపై వచ్చిన ఫిర్యాదు మేరకు సిద్దిపేట జిల్లా డిఎల్‌పివో మల్లికార్జున్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికిచెందిన కత్తుల భాస్కర్‌రెడ్డి 2016-17 సంవత్సరానికి సంబంధించి డబ్బులు అవకతవకలు జరిగాయని ఇచ్చిన ఫిర్యాదు మేరకు దీనిపై పూర్తి విచారణ చేపట్టి పై అధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని డిఎల్‌పివో తెలిపారు. గతంలో హుస్నాబాద్ డిఎల్‌పివో విచారణ చేపట్టారు కాని, ఇంకేమైన రిమార్కులు ఉన్నాయనని మళ్ళీ ఒకసారి విచారణ చేయాలని పైఅధికారుల ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. చేర్యాల ఇంచార్జీ ఎంపిడీవో, ఎంపీవో మహబూబ్ అలీ, పోతిరెడ్డిపల్లి పంచాయతి కార్యదర్శి పల్లె రజిత, గతంలో పంచాయతికార్యదర్శిగా పనిచేసిన అన్నపూర్ణ ఉన్నారు.

**8 ఏళ్లు గడుస్తున్నా వసూలుకాని డబ్బులు...**

చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామపంచాయతీలో 2016-17 సంవత్సరంలో సుమారు రూ.2,43,103/-గోల్‌మాల్ జరిగాయని గ్రామానికి చెందిన కత్తుల భాస్కర్‌రెడ్డి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో నామ మాత్రంగా విచారణ చేపట్టి అందులో రూ1లక్ష 8వేల మాత్రమే వసూలు చేసి వదిలేశారని ఫిర్యాదు దారుడు ఆరోపించాడు. పూర్తి స్థాయిలో మొత్తం డబ్బులు బాధ్యుల నుండి వసూలు చేయకపోవడం, గ్రామపంచాయతీలో అప్పటి రికార్డులు లేవని అనుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## మంత్రి పొన్నంకు ఘన స్వాగతం
### పూల మొక్కను అందించిన పార్టీ నాయకులు

**సిద్దిపేట అర్బన్, జూన్ 27, ప్రభాతవార్త :** సిద్దిపేటలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన జడ్పీ చివరి సర్వసభ్య సమావేశానికి విచ్చేసిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి ప్రభాకర్‌గౌడ్‌కు పార్టీ నాయకులు సాకి అనంద్, ముత్యాల బుచ్చిరెడ్డి, మిట్టపల్లి శ్రీనివాస్, కౌన్సిలర్ రియాజ్, శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్‌లు ఘన స్వాగతం పలికి పూలమొక్కను అందజేశారు. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందేలా చూడాలని మంత్రి కోరినట్లు నాయకులు తెలిపారు. అగస్టు 15లోపు వరంగల్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీమేరకు ప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డి నేృత్వంలో రైతులకు ఒకేదఫాలో రూ.2 లక్షల రుణమాఫీ చేయడానికి కేబినేట్ తీర్మానించినట్లు తెలిపినట్లు తెలిపారు. త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ సిద్దం కావాలని సూచించారని వారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గయాజోద్దీన్, గ్యాదరి మధు, రాశాద్, నజ్జు తదితరులు పాల్గొన్నారు.

# గూడు లేని పేదలకు త్వరలో ఇళ్లు
### అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డులు మంజూరు... సిద్దిపేట జడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



జడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యుని సత్కరిస్తున్న మంత్రి ప్రభాకర్ గౌడ్, ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** త్వరలో గూడు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డు అందించడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రం లోని రెడ్డి ఫంక్షన్‌లో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ వేలేటీ రోజాశర్మ అధ్యక్షతన జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కృషి చేస్తుందన్నారు. రైతులకు ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేయడానికి కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. విద్య, రైతాంగ, వైద్య సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. పదవీ విరమణ పొందుతున్న ప్రజాప్రతినిధులు భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో 26 వేల పాఠశాలలను రూ.1100 కోట్లతో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఐదేళ్ల ప్రజా జీవితంలో గడిపిన జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్, జడ్పీటిసి, ఎంపిపి, ఎంపిటిసిలకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా ప్రజలు విద్యుత్ బకాయిలు ఉన్నారని సిఎం రేవంత్‌రెడ్డి బదనం చేయడం సరికాదన్నారు. ఈ విషయ ం విద్యుత్ ఎస్ఈ స్పందించాలన్నారు. సిద్దిపేట ప్రజలు విద్యుత్ బకాయిలు లేరన్న అయన పేర్కొన్నారు.

**ప్రొటోకాల్ పాటించకుంటే అధికారులే బాధ్యత వహించాలి**

ప్రొటోకాల్ పాటించకుంటే అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని జనగాం ఎమ్మెల్యే పల్లె రాజేశ్వర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేలకు తెలియకుండానే కాంగ్రెస్ నాయకులు ఏ హోదా లేకున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రోటోకాల్ పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

**ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం**

చివరి జడ్పీ సర్వసభ్య సమావేశం పురష్కరించుకుని జడ్పీ చైర్‌పర్సన్‌తోపాటు, జడ్పీటిసి సభ్యులను ఘనంగా సత్కరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, కూర రఘోత్తంరెడ్డి, శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ చేతుల మీదుగా శాలువాలు, మెమోంటోలతో ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను జడ్పీ చైర్మన్ సత్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాజా రెడ్డి, జడ్పీటిసిలు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ధరణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి
### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



విద్యార్థులను సామర్థ్యాలను పరీక్షిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 27 ప్రభాతవార్త:** ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం చిలిపిచెడ్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ధరణి దరఖాస్తుల పరిష్కరణ పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి వారం రోజుల్లో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్లు రోజు వారీగా విభజించుకొని పరిష్కారం చేయాలని ఆదేశించారు.

**ఎరువుల దుకాణం తనిఖీ..**

అలాగే చిలిపిచెడ్ మండలంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల స్టాక్ రిజిష్టర్‌ను, గోదాంలో ఎరువుల నిలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఎలాంటి కొరత లేదని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా యూరియా 10168 మెట్రిక్ టన్నులు, డీఏపీ 704 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 4417 మెట్రిక్ టన్నులు, పొటాష్ 373 మెట్రిక్ టన్నులు, సూపర్ ఫాస్పేట్ 285 మెట్రిక్ అన్నీ కలిపి 15945 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లా వ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయన్నారు. డీలర్లు తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలని, ఎరువుల నియంత్రణ చట్టం 1985 నియమ నిబంధనలు పాటిస్తూ పీవోఎస్ మిషన్ ద్వారామాత్రమే అమ్మకాలు జరపాలని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో రైతులకు ఎరువుల కొరత లేకుండా అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన**

అలాగే చిలిపిచెడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పిల్లలు చదువులో వెనుకబడినట్లు ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తించారు. వెంటనే ఉపాధ్యాయులకు పలు సూచనలు చేస్తూ సబ్జెక్టుల వారీగా బోధన నైపుణ్యాలు మెరుగుపడాలని, నెల గడువు లోగా బోధనా విధానాల్లో మార్పు రావాలని, మళ్లీ క్షేత్రస్థాయి పర్యటనలో విద్యార్థులు సామర్థ్యాల్లో వ్యత్యాసంకనపడకూడదని ఆదేశించారు. అనంతరం చిలిపిచెడ్ గ్రామంలో పర్యటించి బడిబయట పిల్లలు ఎవరైనా ఉన్నారా స్వయంగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ సెంటర్‌ను పరిశీలించి చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, జిల్లా విద్యాధికారి రాధాకిషన్, తహశీల్దార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సిగ్నల్ రాక
### ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు

**కొహేడ, జూన్ 27, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అయా గ్రామాల్లో జియో సిగ్నల్ రాక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడురోజుల నుంచి కార్యాలయాలకు, ప్రజలకు సిగ్నల్ అందక సతమతమవుతున్నారు. ఫోన్ నెట్‌వర్క్ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సిగ్నల్ ఏర్పాటు చేయాలని మండల వినియోగదారులు కోరుతున్నారు.

# శివంపేటలో అడ్డే లేని మట్టి మాఫియా ఆగడాలు
### ప్రైవేటు వెంచర్లకు అక్రమంగా మట్టి తరలింపు-కనుమరుగవుతున్న కొండలు, గుట్టలు-చోద్యం చూస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు



అక్రమంగా మట్టిని తరలిస్తున్న దృశ్యం

**చౌటకూరు, జూన్ 27, ప్రభాతవార్త:** మండలంలోని శివంపేట గ్రామ శివారులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న మాఫియా ఆగడాలకు అడ్డు లేకుండా పోయింది. మట్టిని అక్రమంగా తరలిస్తూ కోట్లు గడిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నా రెవెన్యూ, పోలీసు అధికారులు తమకేం పట్టనట్లుగా వ్యవహిరిస్తుండటంతో ప్రజలు పలు అనుమనాలు వ్యక్తం చేస్తున్నారు. మూడు జెసిబిలు ఆరు లారీలు అన్న చందంగా అక్రమంగా మట్టిని రాత్రి పగలు తేడా లేకుండా యథేచ్ఛగా అక్రమార్కులు తమపనిని కొనసాగస్తున్నారు. గ్రామానికి ఆనుకుని సహజ సిద్దంగా ఉన్న ఎత్తైన కొండలు, గుట్టలు ఉండటంతో సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారికి ఆనుకుని శివంపేట గ్రామం నుంచి చౌటకూరు గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా ప్రైవేటు వెంచర్లు విచ్చలవిడిగా వెలిసాయి. వెలిసిని వెంచర్లలో అంతర్గత రహదారుల ఏర్పాటుకు అవసరమైన ఎర్ర మట్టిని రాత్రి పగలు తేడా లేకుండా తరలిస్తున్నా అధికారులు మాత్రం తమకేం పట్టనట్లుగా వ్యవహిరిస్తున్నారు. మట్టి తరలింపును అడ్డుకునేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే తాము రెవెన్యూ, పోలీసు అధికారులకు నెల నెల అమ్యామ్యాలు చెల్లిస్తున్నామని గ్రామానికి చెందిన కొందరు అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు యదేశ్ఛగా నిబంధనలకు విరుద్దంగా యంత్రాల సహాయంతో భారీ టిప్పర్లు, ట్రాక్టర్లలో మట్టిని ఒక చోట డంప్‌చేస్తున్నారు. డంప్ చేసిన మట్టిని ప్రైవేటు వెంచర్లకు నిర్వాహకులతో బేరసారాలు కుదుర్చుకుని మిట్టిని తరలిస్తూ అమ్రంగా కోట్లకు పడగలెత్తుతున్నారు. ఒక్కో టిప్పరు మట్టిని రూ. 5 నుంచి రూ. 7 వేలకు వరకు, ఒక్కో ట్రాక్టరు మట్టిని రూ. 3 నుంచి 4 వేల రూపాయల వరకు అమ్ముకుంటూ కోట్లు గడిస్తున్నారు. అక్రమంగా మట్టి తరలింపుతో శివంపేట గ్రామ శివారులో కొండలు, గుట్టలు కరిగిపోతున్నాయి.

### మట్టి మాఫియాను అడ్డుకోవాలి
**కో-ఆప్షన్ సభ్యులు ఎండి అలీం**

శివంపేట గ్రామ శివారులో అక్రమంగా మట్టి తరలింపును అడ్డుకోవాలని రెవెన్యూ, పోలీసు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోతోందని మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు ఎండి అలీం ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ శివారులో ఎక్కడ చూసినా మట్టి కుప్పల నిల్వలే కానవస్తాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అక్రమంగా మట్టిని తరలిస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని అలీం డిమాండ్ చేస్తున్నారు.

### పని ఒత్తిడితో బిజీగా ఉంటున్నాం
**తహసీల్దార్ ఈశ్వర్‌రాణి**

అక్రమంగా మట్టిని తరలిస్తున్న విషయాన్ని ప్రభాతవార్త తహసీల్దార్ ఈశ్వరిరాని దృష్టికి తీసుకెళ్లగా పనుల ఒత్తిడి (భూముల రిజిస్ట్రేషన్లు, పర్యటనలు, ఇతర పనులు) మూలంగా క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతందో సమాచారం తెలుసుకునే అవకాశం లేకుండా పోయిందని వివరణ ఇవ్వడం విశేషంగా చెప్పవచ్చు. ఇప్పటికైన అధికారులు అక్రమంగా మట్టిని తరలించడాన్ని అడ్డుకోవాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ ఖజానాకు గండి పడకుండా చూడాల్సిన అవసరం అధికారులపై ఉందని చెప్పవచ్చు.



మాట్లాడుతున్న ఎస్‌పి రూపేష్

## గంజాయిని సాగు చేస్తే చర్యలు తప్పవు
### జిల్లా ఎస్‌పి రూపేష్ చెన్నూరి

**సంగారెడ్డి టౌన్, జూన్ 27, ప్రభాతవార్త:** గంజాయిని సాగు చేసినా, రవాణా చేసినా, మాదక ద్రవ్యాలు వినియోగించినా సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి సిహెచ్ రూపేష్ చెన్నూరి హెచ్చరించారు. గురువారం నారాయణఖేడ్ సబ్ డివిజన్ అధికారులతో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పెండింగ్ (అండర్ ఇన్వెస్టిగేషన్)లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల వివరాలను పోలీసుఅధికారులను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు పరిమిత లిమిట్‌లో ఉండాలని, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసే క్రమంలో ఇన్వెస్టిగేషన్ చేసే తీరుపై పలు సూచనలు, సలహాలను అందించారు. ప్రతి కేసులో నాణ్యమైన ఇన్వెస్టిగేషన్‌ను త్వరితగతిన పూర్తిచేసి నేరస్తులను న్యాయస్థానంల హాజరుపర్చాలని సూచించారు. జిల్లాలో గంజాయి, మాదక ద్రవ్యాలల వినియోగాన్ని నిర్మూలించాలని, అందుకు గ్రామాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు ఠాణా పరిధిలో విజిబుల్ పోలీసింగ్ ద్వార ప్రజలకు అందుబాటులో ఉంటూ డ్రంక్ ఆండ్ డ్రైవ్ నిర్వహించాలని, కమ్యూనిటీ పోలీసింగ్ ద్వార సైబర్ నేరాల గురంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరంతరం ప్రజలను అప్రమత్తం చేస్తూ ఉండాలన్నారు. ప్రజలు ఇబ్బందులు ఇబ్బందులు పడేలా చట్టవ్యతిరేక కార్యాక్రమాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**అనుమానితులకు ఎస్‌పి కౌన్సిలింగ్...**

గతంలో గంజాయి సాగు, రవాణ చేసిన అనుమానితులను జిల్లా ఎస్‌పి రూపేష్ చెన్నూరి కౌన్సిలింగ్ నిర్వహించారు. గతంలో చేసిన తప్పులు పునరావృతం కాకుండా సమాజం మెచ్చే తీరుగా జీవనం సాగించాలని సూచించారు. మరో మరు తప్పులకు పాల్పడితే పిడి యాక్ట్‌ను తెరుస్తామని హెచ్చరించారు. సమావేశంలో నారాయణఖేడ్ డిఎస్‌పి వెంకట్‌రెడ్డి, నారాయణఖేడ్, కంగ్టి సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, చంద్రశేఖర్, డిసీఆర్బీ ఇన్స్‌పెక్టర్ రమేష్, సబ్‌డివిజన్ ఎస్ఐలు పాల్గొన్నారు.

### రైతులను ముంచుతున్న
## కరీంనగర్ పాల ఉత్పత్తి సంస్థ
### సూపర్‌వైజర్‌ను గదిలో బంధించి రైతుల నిరసన



సూపర్‌వైజర్‌లను గదిలు ఉంచి తాళం వేసిన దృశ్యం

**కొహేడ, జూన్ 27, ప్రభాతవార్త:** కరీంనగర్ పాల ఉత్పత్తి సంస్థ పాల రేటు భారీగా తగ్గించారని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. అరునెలల్లో రూ.7 తగ్గించారని మండల పరిధిలోని బస్వాపూర్‌లో గ్రామంలో పాడి రైతులు అగ్రహం వ్యక్తం చేసి సూపర్‌వైజర్ కర్ణాకర్‌రెడ్డి, డాక్టర్ ప్రసన్నకుమార్‌లను పాల కేంద్రం గదిలో తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాడి రైతులు మాట్లాడుతూ దానా రేట్లు పెరుగుతున్నాయని.. పాల ప్యాకెట్, పెరుగు రేట్లు వివిధ పాల వస్తువుల రేట్లు భారీగా పెరుగుతున్నాయన్నారు. రైతులు వాననక, ఎండనక కష్ట, నష్టాలను ఓర్చుకొని పశువులకు సేవ చేసి పాలను ఉత్పత్తి చేస్తే కరీంనగర్ డెయిరీ తీవ్ర నష్టం కలిగిస్తున్నారని తెలిపారు. మిగితా డెయిరీలు విజయ, మూల్కనూర్ రైతులకు మేలు చేస్తుంటే కరీంనగర్ డెయిరీ వారు దోపిడి చేస్తున్నారని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అక్రమంగా మట్టి తరలింపులో చర్యలు తీసుకోవాలి
### నీటి పారుదల శాఖ ఈఈ శ్రీనివాస్‌రావు

**నర్సాపూర్ జూన్ 27, ప్రభాతవార్త :** చెరువుల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నవారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ ఈఈ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం నర్సాపూర్ ఇరిగేషన్ కార్యాలయాన్ని సందర్శించిన అనంతరం ఆయన చిన్నచింతకుంట ఆముదాల చెరవు కట్ట పై నడుస్తున్న కట్ట మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెరువుకుంటలు అభివృద్ధి చెంది బాగున్నాయని ఎక్కడైన చెరువులు దెబ్బతిన్నట్లు తమ దృష్టికి వస్తే వెంటనే మరమ్మతు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాగా కొంతమంది చెరువులో నుండి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని అన్నారు. ఈ మేరకు శివ్వంపేట మండలం నవాపేట గ్రామం నుండి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారన్న విషయం తెలియగానే నర్సాపూర్ నీటిపారుదల శాఖ డిఈ బుచ్చిబాబు ఈ నెల 7న స్థానిక పోలీస్ స్టేసన్‌లో ఫిర్యాదు చేశారని చెప్పారు. ఇప్పటివరకు దీనిపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు చెరువులోనుండి అక్రమంగా మట్టి ని తరలిస్తున్న వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేస్తే వారు పట్టించుకోవడం లేదన్నారు. గురువారం శివ్వంపేటమండలం చిన్నగొట్టి ముక్ల గ్రామంలోని పటేల్‌చెరువు, బయ్యన్నచెరువు నుండి అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం వస్తే వెంటనే ఇరిగేషన్ ఏఈ మణిభూషణ్ తదితరులు పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారని తెలిపారు. ఈవిషయంలో పోలీసుల సైతం అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తే కొంత వరకైనా ఈ అక్రమ మట్టి తరలింపు అరికట్ట గలుగుతామన్నారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులు ఇలాంటి ఫిర్యాధులు ఇచ్చిన వెంటనే చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఈఈ శ్రీనివాస్‌రావు అన్నారు. ఈకార్యక్రమంలో నర్సాపూర్ ఇరిగేషన్ డిఈ బుచ్చిబాబు, ఏఈ మణిభూషన్‌గౌడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిన్న చింతకుంట చెరువు కట్ట పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రావు

## బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలి



మూసారాంబాగ్ బ్రిడ్జి పనులపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే

**హైదరాబాద్, జూన్ 27 ప్రభాతవార్త:** మూసారంబాగ్ హై లెవల్ బ్రిడ్జి పనులను అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గురువారం సంబంధిత అధికారులతో కలిసి అక్కడ పర్యవేక్షించారు. ఈ పనులకు 8 నెలల క్రితం అప్పటి రాష్ట్ర ఐటి శాఖ మంత్రి కెటిఆర్ శంకుస్థాపన చేశారని ఆయన గుర్తు చేశారు. ట్రాఫిక్ డైవర్షన్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. త్వరగా పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధికారులు రేణుక, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించేది కాకా వెంకటస్వామి విద్యాసంస్థలే

**చిక్కడపల్లి, జూన్ 27 ప్రభాతవార్త:** మాజీ కేంద్ర మంత్రి స్వర్గీయ కాకా వెంకటస్వామి నెలకొల్పిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థలు 'ఇండియా టుడే' ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో 'ఉత్తమ విద్యాసంస్థ'గా నిలిచింది. ఈ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ లా కళాశాల తెలంగాణ రాష్ట్రంలోనే రెండవ స్థానంలో నిలువగా జాతీయ స్థాయిలో అరవై ఐదవ ర్యాంక్ సాధించి ఉత్తమ విద్యాసంస్థగా గుర్తింపు సాధించింది. దేశవ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల్లో వసతులు, బోధన, చదువుకునే వాతావరనం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని 'ఇండియాటుడే' సంస్థ ర్యాంకులను ప్రకటించింది. బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థఉ జాతీయ,రాష్ట్రస్థాయిలోఉత్తమ ర్యాంకులు సాధించాయి. బిఎ.బిఎస్‌సీ, బికామ్,బిబిఎ తదితర కోర్సుల్లో తెలంగాణలో ఏడు, ఐదు, పన్నెండు, తొమ్మిది ర్యాంకు, జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులను సాధించింది. లా కళాశాలతో పాటు డిగ్రీ కళాశాల వేర్వేరు కోర్సుల్లో మంచి ర్యాంకులతో అంబేద్కర్ విద్యాసంస్థలు నాణ్యమైన విద్యను అందించడంలో వేదికగా నిలిచిందని విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు.

## నవభారత నిర్మాతల్లో ఒకరు మన పీవీ

-విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు



మాజీప్రధానీ పీవీ.నరసింహారావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు, కళావిఎస్.జనార్దనమూర్తి తదితరులు

**చిక్కడపల్లి, జూన్ 27 ప్రభాతవార్త:** మాజీప్రధానమంత్రి పీవీ.నరసింహారావు నవభారత నిర్మాతల్లో ఒకరని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. గురువారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో ఎందరోమహానుభావులు మధురస్మృతులు కార్యక్రమంలో భాగంగా బహుభాషాకోవిధులు, మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ పీవీ.నరసింహారావు సంస్మరణ సభ గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్. జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ అభ్యుదయవాది, సంస్కరణాభిలాషి అని, విజ్ఞాన సముపార్జన చేసి ఆ వెలుతురును ప్రపంచానికి అందించారన్నారు.ఏ రంగంలో ఉంటే ఆ రంగంలో సంస్కరణలు తీసుకువచ్చారని, మంత్రిగా,ముఖ్యమంత్రిగా,ప్రధానమంత్రిగా ప్రజాసేవ చేశారన్నారు. కార్యక్రమంలో గాయకుడు చింతలపూడి త్రినాథరావు, సుబ్బుమ్యూజిక్ అకాడమి అధినేత శ్రీధరం రామసుబ్రహ్మణ్యం, సంఘసేవకుడు పబ్బ వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

### వాటర్‌బోర్డులో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

-బోర్డు ఎండి అశోక్‌రెడ్డి



వాటర్‌బోర్డు ఎండి అశోక్‌రెడ్డిని కలిసిన వాటర్‌వర్క్స్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులసంఘం అధ్యక్షుడు నారాయణ బృందం

**చిక్కడపల్లి, జూన్ 27 ప్రభాతవార్త:** వాటర్‌బోర్డులో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హైదరాబాద్ మెట్రోవాటర్‌వర్క్స్ సీవరేజ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వాటర్‌వర్క్స్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులసంఘం అధ్యక్షుడు నారాయణ ఆధ్వర్యంలో యూనియన్ బృందంతో కలిసి నూతనంగా వాటర్‌బోర్డు ఎండిగా పదవీ బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా అశోక్‌రెడ్డిని కలిసి ఘనంగా సత్కరించారు. కార్మికుల సమస్యల విషయంలో తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించడానికి కృషిచేస్తానని,అందరం కలిసి బోర్డు సేవలు, మెరుగు పరచడం,రెవెన్యూ పెంచడానికి కృషి చేద్దామన్నారు. యూనియన్ అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ గత 10 సంవత్సరాల అనుబంధాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కుమార్, ఆంజనేయులు, సురేశ్ బాబు, వీరస్వామి, మల్లేష్, ఆంజనేయులు, నర్సింహ్ పాల్గొన్నారు.

### బాధితులకు రికవరి సెల్‌ఫోన్‌ల అందజేత

**చిక్కడపల్లి, జూన్ 27 ప్రభాతవార్త:** చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌లో సెల్‌ఫోన్ చోరీకి గురైన బాధితులలో ఎంతో మందికి రికవరీ చేసి వారికి తిరిగి అందించడం జరిగిందని స్థానిక ఇన్స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య అన్నారు. గురువారం చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్ చోరికి గురైందని బాధితులు కోల్‌కతా ప్రాంతానికి చెందిన బాసుదేవ్(35) బాగ్‌లింగంపల్లి ప్రాంతంలో సెల్‌ఫోన్ చోరీకి గురైందని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ఆచూకి కనుగొని రెండు సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందించగా వారు సంతోషం వ్యక్తం చేయడంతో చిక్కడపల్లి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

### సిపిజిఈటి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**తార్నాక, మే 27 ప్రభాతవార్త:** టీఎస్ సీపీజీఈటీ...2024 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షల కన్వీనర్ ప్రొ. పాండురంగారెడ్డి తెలిపారు. ఈ పరీక్షలకు జంటనగరాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 30 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీతో పాటు కాకతీయ, జేఎన్‌టీయూ, శాతవాహన,తెలంగాణ మహిళా యూనివర్సిటీలల్లో ఎంఏ,ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంఈడీ ఇతర పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో 2024...25 విద్యా సంవత్సరానికి జులై 6 నుంచి 15 వరకు మొత్తం సబ్జెక్టులకు ప్రవేశపరీక్షలు ఉంటాయని కన్వీనర్ వెల్లడించారు.

## ఆదర్శాలను ఆచరించినప్పుడే మానవజన్మకు సార్థకం

-తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి



దివ్యాంగ పిల్లలకు నోటుపుస్తకాలను పంపిణీచేస్తున్న రమణాచారి, నాగేశ్వరరావు, సాయిబాబా తదితర అతిథులు

**నాంపల్లి, జూన్ 27 ప్రభాతవార్త :** మేఘానికి విలువ గర్జించినప్పుడు కాదు వర్షించినప్పుడేనని, అలాగే మానవజన్మకు సార్థక్యం వట్టిగా ఆదర్శాలను వల్లించినప్పుడు కాదు వాటిని ఎవ్వరిస్థాయిలో వారు ఆచరణసాధ్యం చేసినప్పుడేనని, విశ్రాంత ఐఎఎస్ అధికారి, తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అన్నారు. దివ్యాంగులపట్ల జాలి చూపించక్కర్లేదని, తోటి మనుషుల్లా గౌరభిమానాలు పంచితే చాలన్నారు. ప్రతీ ఒక్కరూ తమకున్న దానిలో కొంత తోటివారికి సహాయం చేయాలని సూచించారు. అకిలభారత వికలాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో గురువారం ఉదయం రెడ్‌హిల్స్‌లోని డా. కె.వి.రమణాచారి క్యాంపు కార్యాలయంలో దివ్యాంగుల ఉద్యమసారధి హెలెన్ కెల్లర్ 144వ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన రమణాచారి సంస్థ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, వికలాంగుల సహకార సంస్థ మాజీ ఛైర్మన్ పిన్నమనేని సాయిబాబా, బాలరాజుగౌడ్, శ్రీనివాస్, రవీందర్, శంకర్, మరియామ్మ, గంగమ్మ తదితరులతో కలిసి తన పెన్షన్‌లోంచి కొంతమొత్తంతో 25మంది దివ్యాంగుల పిల్లలకు నోటు పుస్తకాలను పంపిణీచేసి మాట్లాడారు. ప్రభుత్వాలు దివ్యాంగుల చట్టాలను తు.చ తప్పకుండా అమలు చేస్తూ వారి హక్కుల కాపాడుతూ సమస్యలను సంపూర్ణంగా పరిష్కరించి ఆదుకోవాలని సూచించారు. సాయిబాబా మాట్లాడుతూ దివ్యాంగులపట్ల ప్రేమాభిమానాలతో రమణాచారి వారి విద్యాభివృద్ధికోసం పుస్తకాలను పంపిణీచేయడం ఆదర్శప్రాయం స్ఫూర్తిదాయకమన్నారు. కొల్లి నాగేశ్వరరావు వికలాంగుల హక్కులు కాపాడడం, రాజ్యాధికారం కల్పించడంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పెన్షన్ పెంపు, స్వయం ఉపాధికి లోన్లు, డబుల్‌బెడ్‌రూమ్ కేటాయింపు, బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు.

## మహిళలు ఆర్థిక స్వావలంబనకే ఉపాధి శిక్షణ కేంద్రాలు



కేంద్రాన్ని పరిశీలిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్

**చిక్కడపల్లి, జూన్ 27 ప్రభాతవార్త:** మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాలు ఎంతో ఉపయోగపడుతాయని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. గురువారం గాంధీనగర్ డివిజన్ పరిధిలోని వివి.గిరినగర్ కమ్యునిటీ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్, నివి ఫౌండేషన్, స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ చేయేతతో ఏర్పాటైన ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని కార్పొరేటర్ పావనీ వినయకుమార్ పరిశీలించారు. ఇప్పటివరకు రెండు బ్యాచ్‌లు పూర్తి చేసుకుని మూడవ బ్యాచ్ శిక్షణను నేడుప్రారంభించారు. స్వయం ఉపాధి శిక్షణకు సంబంధించి అవసరమైన సదుపాయాలను అందించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. త్వరలో కుట్టుతోపాటు మగ్గం వర్క్‌లో శిక్షణ అందించే కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్,కేంద్రం ఉపాధ్యాయురాలు లలిత, బిజెపి నేతలు విజయలక్ష్మి, సాయికుమార్, ఆనంద్‌రావు, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

### అన్ని పార్టీలకు టిడిపి ఒక్కటే ప్రత్యామ్నాయం

-టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టిడిపి నేతలు

**ముషీరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** తెలంగాణలో అన్ని పార్టీలకు ప్రత్యామ్నాయం టీడీపీ మాత్రమేనని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా అన్నారు. గురువారం టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలి సంతకంతో ఐదు హామీలను అమలు పరిచిన సందర్భంగా లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ఇచ్చిన వాగ్దానాలను అమలోకి తీసుకురావటం అనేది తెలుగుదేశం పార్టీ విశ్వసనీయతకు నిదర్శనమని, అందుకే నేటికీ ప్రజల గుండెల్లో తెలుగుదేశం పట్ల ఆదరణభావం ఉందని అన్నారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ గత వైభవం కోసం కార్యకర్తలతో కలసి మేమంతా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, సత్యనారాయణ, వెంకటేష్, కిరణ్‌కుమార్, బి.రాజు, భానుప్రకాష్, శుక్రనాయుడు పాల్గొన్నారు.

### 29న కొండగట్టుకు వస్తున్న పవన్ కళ్యాణ్‌కు స్వాగతం పలకండి : ముమ్మారెడ్డి ప్రేమకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ముమ్మారెడ్డి ప్రేమకుమార్

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 27, ప్రభాతవార్త** మొదటిసారిగా తెలంగాణకు ఈనెల 29న కొండగట్టుకు విచ్చేస్తున్న జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం పలకాలని జనసేప పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమకుమార్ పిలుపునిచ్చారు. కూకట్‌పల్లి నియోజకవర్గం 5ఫేజ్‌లోని జనసేన పార్టీ ఆఫీస్‌లో జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం పలికేందుకు కూకట్‌పల్లి జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమకుమార్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో భేటి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 29న రాష్ట్రంలోని కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు విచ్చేస్తున్న పవన్ కళ్యాణ్‌కు జనసేన నాయకులు, వీరమహిళలు నియోజకవర్గం నుంచి తరలివెళ్లి ఘన స్వాగతం పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లా శంకర్, లక్ష్మణరావు, మహేష్, ప్రసాద్,షణ్ముఖ, సుబ్బు పాల్గొన్నారు.

### కెసిఆర్‌ను కలిసిన గోషామహల్ బిఆర్‌ఎస్ నాయకులు

**గోషామహల్,జూన్ 27ప్రభాతవార్త:** ఎర్రవెల్లిలోని వ్యవసాయక్షేత్రంలో ఉన్న తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను గోషామహల్ నియోజకవర్గం బిఆర్‌ఎస్ నాయకులు గడ్డం ఆశీష్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నేతలతోకలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే కాలంలో పార్టీకి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### ఉత్తమగ్రంథాలకు సారస్వత పరిషత్తు రాష్ట్రస్థాయి పురస్కారాలు

**నాంపల్లి, జూన్ 27 ప్రభాతవార్త :** తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో వెలువడిన ఉత్తమ గ్రంథాలకు 2024 సంవత్సరానికిగాను తెలంగాణ సారస్వత పరిషత్తు రాష్ట్రస్థాయి పురస్కారాలను ప్రకటించింది. ఈ మేరకు పరిషత్తు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, డా. జుర్రు చెన్నయ్యలు మీడియాకు వివరాలను వెల్లడించారు. పద్య/గేయ కవిత్వంలో రాచాలపల్లి బాబు దేవిదాసశర్మ శ్రీరామాయణోపనిషత్తు; వచన కవిత్వంలో గోట నిర్మలారాణి అద్దం నా చిరునామాకాదు; నవలలో డా. మెన్నం ఉపేందర్ మత్తడి దునికిన కోపులనీళ్లు; సాహిత్య విమర్శలో బండారి రాజ్‌కుమార్ తెలంగాణ కవిముద్ర; కథలో డా. పసునూరి రవీందర్ కండిషన్స్ అప్లై; ఇతరాల విభాగంలో రావుల పుల్లాచారి రచ్చబండ నాటికల సంపుటిలలు పురస్కారాలకు ఎంపికైనట్లు, పోలీస్ భూమేష్ రచించిన స్వేచ్ఛకు సంకెళ్ళు కవితా సంపుటికి యువపురస్కారం లభించినట్లు పేర్కొన్నారు. పుస్తకాలతో నిమిత్తం లేకుండా సాహిత్యరంగంలో సమగ్ర కృషిని గుర్తిస్తూ ప్రతీయేటా నలుగురు ప్రముఖులకు పరిషత్తు అందజేస్తున్న వరిష్ట పురస్కారాలను సాహితీవేత్త డా. శ్రీరంగాచార్య; కవి, రచయిత జింబో (మంగారి రాజేందర్); ప్రజాకవి జయరాజు; కథా నవలా రచయిత బోరి మురళీధర్‌లకు అందజేస్తున్నట్లు వివరించారు. త్వరలో హైదరాబాద్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఉత్తమ గ్రంథ రచనలు, వరిష్ట పురస్కారాలకు ఒక్కొక్కరికి 20వేల రూపాయల నగదు, యువపురస్కారానికి 10వేలులతోపాటు జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించడం జరుగుతుందని శివారెడ్డి, చెన్నయ్యలు తెలిపారు.

### కెసిఆర్‌ను కలిసిన బిఆర్‌ఎస్ నాయకులు

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 27, ప్రభాతవార్త** తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును వారి వ్యవసాయ క్షేత్రంలో వనపర్తి జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీన సీనియర్ నాయకులు నిరంజన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీనివాస్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### బోనాల పండుగ నిధులు పెంచాలని బండి రమేష్‌కు వినతి..

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 27, ప్రభాతవార్త** రాబోయే బోనాల పండుగ సందర్భంగా ప్రతి గుడికి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ నిధులు పెంచి మంజూరు చేయాలని కమీషనర్‌కు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ గురువారం వినతిపత్రం సమర్పించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఆయా దేవాలయాలలో సాంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే బోనాల పండుగ సందర్భంగా నిధులు పెంచుతూ నిధులు విడుదల చేయాలని అభ్యర్థించారు.

### ప్రాణకోటికి ప్రేమ త్యాగాలే ముఖ్యమని చాటిన అజరామరం నాటకం



అజరామరం సందేశాత్మక నాటకంలో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, జూన్ 27 ప్రభాతవార్త :** సృష్టికర్త ఈ అనంత ప్రాణకోటికి అందించిన వరాలే ప్రేమ, త్యాగమని, ప్రాణికోటి ఉద్భవించిన మరుక్షణం ఇవి పుట్టుకొచ్చాయని, అలాంటి ప్రేమ త్యాగాలే ముఖ్యమని అజరామరం నాటకం చాటి చెప్పింది. ప్రాణికోటి తమ జీవన ప్రయాణంలో గాడితప్పినా ప్రేమ త్యాగం మాత్రం తమ విధులను సక్రమంగా నిర్వర్తించడం జరుగుతూనే ఉందని, ఎక్కడైతే పవిత్రమైన ప్రేమ ఉంటుందో అక్కడ త్యాగం త్యాగంచేస్తూనే ఉంటుందని ఈ అజరామరం నాటకం స్పష్టం చేసి విచ్చేసిన అశేషప్రేక్షకులను ఆకట్టుకొని ఆలోచింపజేసింది. ప్రఖ్యాత సాంస్కృతిక సంస్థ రసరంజని ఆధ్వర్యంలో ప్రతీనెలా నాటకం-ప్రేక్షకుడికి వినోదం, నటుడికి ఆనందం-అదే మా బాట మాట నినాదంతో నిర్వహిస్తున్న నాటక ప్రదర్శనల్లో భాగం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో గురువారం రాత్రి కళావర్షిణి హైదరాబాద్ వారి సమర్పణలో జెట్టి హరిబాబు రచన దర్శకత్వం; సురభి నాగరాజు సంగీత దర్శకత్వంలో నటీనటులు సోమయ్యచౌదరి, డా. శ్రీజ, డి.ఫణీందర్, కె.సరిత, శశిధర్, ఇందిరల ఆయాపాత్రలో జీవించి నటించిన అజరామరం నాట కం అద్భుతంగా ప్రదర్శింపబడి మంచి సందేశాన్ని అందించింది.

### ప్లాస్టిక్‌తో బెంచ్‌ల తయారీ

-ఓక్రిడ్జ్ విద్యార్థిని సృజనాత్మకత



**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** భూమిలో కలిసిపోని వ్యర్థమైన ప్లాస్టిక్‌ని వాడి తరగతి గదుల బెంచీలు తయారు చేసి తన ప్రతిభను చాటింది ఓ పాఠశాల విద్యార్థిని. పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్‌ని పది మందికీ ఉపయోగపడేలా చేసి తన సృజనాత్మకతకు అద్దం పట్టింది. వివరాల్లోకి వెళ్తే, నగరంలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన అనాహిత అనే విద్యార్థిని, స్వచ్ఛంద సంస్థయిన ఇన్‌ఫ్రాగ్రీన్ సహకారంతో ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్‌తో క్లాస్ బెంచీలను రూపొందించింది. వందకు పైగా ఆమె రూపొందించిన బెంచీలను బోరబండలోని ప్రభుత్వ పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు, ఉపాధ్యాయులు ఆమె ప్రతిభను కొనియాడుతూ అభినందించారు.

## పారిశ్రామిక సబ్సిడీలను తక్షణమే విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల డేనియల్, చిత్రంలో దయానందరావు తదితరులు

**సైఫాబాద్, జూన్ 27 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో 2019 నుంచి 2020 వరకు పెండింగ్‌లో ఉన్న వాహనాలు చిరు వ్యాపారాల పారిశ్రామిక ప్రోత్సహక సబ్సీడీలను ప్రభుత్వం తక్షణమే రిలీజ్ చేయాలని ఎంఎస్‌ఎంఇ (మైక్రో స్మాల్ మీడియం ఎంటర్ ప్రైనర్స్) రైట్స్ ప్రొటెక్షన్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ విషయంపై ప్రభుత్వం స్పందికపోతే న్యాయ స్థానాన్ని అశ్రయిస్తామని అసోసియేషన్ హెచ్చరించింది. ఎంఎస్‌ఎంఇ అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండల డేనియల్, ఎం.ప్రవీణ్, సలహాదారు గొల్లపల్లి దయానందరావు మాట్లాడుతూ స్వాంత్ర్యం సిద్ధించి 7దశాబ్దాలకుపైగా గడిచినప్పటికి దళితుల బ్రతుకులు సామాజికంగా, ఆర్థికంగా ఎదగలేక తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుతా ్వలు, పాలకులు మారుతున్న ఎస్సీ, ఎస్టీల బ్రతుకులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడిలాగానే ఉందన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో పదేళ్ళ క్రితం మంజూరైన పారిశ్రామిక ప్రోత్సహాలు నేటికి లబ్ధిదారులకు విడుదల కాలేదని, దీనికి కారణం గత మాజీ సిఎం కెసిఆర్, పరిశ్రమల శాఖ మంత్రి అసమర్థతేనని ఆరోపించారు. రాష్ట్రంలోని దాదాపు 70 వేల ఎంఎస్‌ఎంఇ పరిశ్రమల్లో ఇప్పటికే 20 వేలు మూతపడి పెద్ద ఎత్తున ఉపాధి, పెట్టుబడి కోల్పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంఎస్‌ఎంఇ కింద అందించే ప్రోత్సహక సబ్సీలను ఒక్కొక్కరికి 20 లక్షల నుంచి 50 లక్షల వరకు, మహిళలకు 30 నుంచి 70 లక్షల వరకు పెంచాలని, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టి మహిళల పరిశ్రమలకు అమ్మకపు పన్ను 7 సంవత్సరాలకు సడలింపు ఇవ్వాలని, పవర్ రిబెట్‌ను యూనిట్‌కు 3 రూపాయలుగా సవరించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై ఈ మేరకు ఇప్పటికే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంబంధిత అధికారులకు వినతి పత్రాలను అందజేయడం జరిగిందని వారు తెలిపారు.

## బౌన్సర్లతో బెదిరిస్తున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

-ఉన్నత విద్యామండలి కార్యదర్శికి బిసి యువజన, విద్యార్థి సంఘం వినతి



వినతిపత్రం అందజేస్తున్న కుల్కచర్ల శ్రీనివాస్, శ్యాం కురుమ, మహేష్ యాదవ్ తదితరులు

**హైదరాబాద్,జూన్ 27,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యా సంస్థలు, ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలు తమ ప్రాంగణాల్లో చట్టవ్యతిరేకంగా బౌన్సర్లను నియమించుకుని డొనేషన్లపై ప్రశ్నిస్తున్న తల్లిదండ్రులను బెదిరిస్తూ, భౌతిక దాడులకు పాల్పడతున్నాయని వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుని వాటి గుర్తింపు రద్దు చేయాలని బిసిసంక్షేమసంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ ,బిసి యువజన సంఘం కనకాల శ్యాంకురుమ, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్‌యాదవ్‌లు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నతవిద్యామండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యను వ్యాపారం చేయడమేకాకుండా చదవును అంగట్లో సరుకుగా చేస్తున్న కళాశాల యాజమాన్యాలు తప్పిపుచ్చుకోవడానికి అక్రమాలు బయటపడకుండా ఉండటానికి ప్రైవేట్ సైన్యాన్ని తయారు చేసుకుని కళాశాల అవరణలో రానీయకుండా చట్టవిరుద్ధంగా గుండాలను నియమించడం సరికాదని ఇలాంటి కాలేజీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బిసియువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి విజయ్, గూడూరు భాస్కర్, పాలకూరి కిరణ్ పాల్గొన్నారు.

## ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా మా దృష్టికి తీసుకురావాలి : ఎమ్మెల్యే



రాజీవ్ గాంధీనగర్‌లో ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు.

**యూసుఫ్‌గూడ, జూన్ 27, ప్రభాతవార్త :** ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తాను అన్ని వేళల ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. గురువారం రాజీవ్‌గాంధీనగర్ బస్తీలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా బస్తీలో అంతర్గత డ్రైనేజీ పొంగి పొర్లుతున్నదని చిన్నపాటి వర్షానికే నీళ్ళు ఇళ్ళల్లోకి చేరుతున్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా గత ప్రభుత్వం 20వేల లీటర్ల మంచినీరు వాడుకోవడం కోసం జీవో జారీ చేసిందని అయితే ప్రస్తుతం వాటర్‌వర్క్స్ అధికారులు ముక్కుపిండి నీటిబిల్లులు వసూలు చేస్తున్నారని వీటి వలన ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. డ్రైనేజి సమస్యను త్వరలోనే పరిష్కరించడం జరుగుతుందని ఎవరు కూడా నీటి బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదని తాను సంబంధిత అధికారులతో మాట్లాడుతానని తెలిపారు. పేదవారిని ఇబ్బందిపెట్టి అధికారులు డబ్బులు వసూలు చేసి ప్రజా ఉద్యమం చేస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డి.ఇ ఆనంద్, ఏఇ రంజిత్, జలమండలి మానేజర్ విలియం ప్రకాష్, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు లింగాల ఆయిలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, రమేష్, ముత్యాల దుర్గ, సయ్యద్ రియాజ్, జ్ఞానేశ్వర్, యోగిరాజు స్వామి, రామ్‌రెడ్డి, చాంద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

## పీడిత ప్రజల కోసం ఉద్యమించిన యోధుడు బొజ్జా తారకం : జస్టిస్ చంద్రయ్య



బొజ్జా తారకం-వ్యాసాలు' అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ జి.చంద్రయ్య

**సైఫాబాద్, జూన్ 27 ప్రభాతవార్త:** హక్కుల దిక్సూచి, పీడిత ప్రజల గొంతుక, ప్రముఖ న్యాయవాది బొజ్జా తారకం రాసిన 'బొజ్జా తారకం-వ్యాసాలు' అనే పుస్తకాన్ని గురువారం సాయంత్రం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ ఛైర్మన్ డా.జస్టిస్ జి.చంద్రయ్య ఆవిష్కరించారు. అలాగే ఆయన అనువాదం చేసిన 'బుద్ధుని ప్రవచనం-ఆంగ్ల మూలం' అనే పుస్తకాన్ని ప్రొఫెసర్ జి.సత్యనారాయణ ఆవిష్కరించగా, తారకం సతీమణి డాక్టర్ బి.విజయభారతి వ్యాస సంపుటి 'స్వతంత్ర భారతదేశం స్త్రీలకు గుప్పెడు ధూళినే మిగిల్చిందా?' అనే పుస్తకాన్ని ప్రముఖ స్త్రీవాద రచయిత్రి కొండవీటి సత్యవతి ఆవిష్కరించారు. బొజ్జా తారకం 85వ జయంతిని పురస్కరించుకుని బొజ్జా తారకం ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు ప్రముఖ కవి, విమర్శకులు డా.శిఖామణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ జి.చంద్రయ్య మాట్లాడుతూ హక్కుల ఉద్యమ నేతగా, బహు గ్రంథాల కర్త, పోరాట యోధుడు తారకం సమాజానికి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. అంబేద్కర్ పురస్కార గ్రహీత అయిన తారకం ప్రాణాల త్యాగానికి సిద్ధమై ప్రజల సంక్షేమం కోసం అన్యాయాలను ఎదిరించిన చైతన్య మూర్తి అని ఆయన ప్రశంసించారు. బహుముఖ ప్రజ్ఞాశీలి అయిన ఆయన నిరంతరం ప్రజల కోసం ఆలోచించేవారని, కవిగా, రచయితగా, న్యాయవాదిగా, అనువాదకుడిగా ఎన్నో సేవలు అందించారని జస్టిస్ కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన తారకం సతీమణిని ఘనంగా సత్కరించారు. శిఖామణి మాట్లాడుతూ తారకం జగమేరిగిన నాయకుడని, హేతువాది అని, న్యాయవాది, గోదావరి లాంటి కవి, అంబేద్కరిస్ట్ అని ప్రశంసించారు. కొండవీటి సత్యవతి మాట్లాడుతూ తారకం రాసిన వ్యాసాలు ఎంతో అద్భుతమైనవని కొనియాడారు. విజయభారతి రాసిన ఆనేక వ్యాసాలు చాలా బాగున్నాయని అందరూ చదవదగ్గగలవని చెప్పారు. ఈ సభలో సత్యనారాయణ, మాజీ జిల్లా జడ్జి నిమ్మ నారాయణ, ట్రస్ట్ సమన్వయకర్త గునుమల జ్ఞానేశ్వర్ తదితరులు ప్రసంగించారు.

## నా వంతు కృషి చేస్తా : ఎమ్మెల్యే

**యూసుఫ్‌గూడ, జూన్ 27, ప్రభాతవార్తా** ఎన్‌ఆర్‌ఆర్‌పురం కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలోని ప్రజల థర్డ్ పార్టీ రిజిస్ట్రేషన్ అయ్యే విధంగా తన వంతు కృషిచేస్తానని బీఆర్‌ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జూబ్లీహిల్స్ శాసన సభ్యులు మాగంటి గోపినాధ్ అన్నారు. ఇటీవల బోరబండ ఎన్‌ఆర్‌ఆర్‌పురం కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో జరిగిన ఎన్నికల్లో సెక్యూలర్ ప్యానెల్ ఘనవిజయం సాధించడంతో గురువారం మర్యాదపూర్వకంగా కమీటీ సభ్యులు, ఎమ్మెల్యే మాగంటిగోపినాధ్‌ను స్టాంపు కార్యాలయంలో కలిశారు. ఈసందర్భంగా ఆయన నూతనంగా ఎన్నికైన కమిటి సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. సంక్షేమ సంఘాలు ప్రజలకు ప్రజా ప్రతినిధులకు అధికారులకు సమస్యలపై వారధిగా నిలవాలని అభివృద్ధికి తగిన విధంగా పాటు పడాలని సూచించారు. తనవంతు ప్రజలకు ఎపుడు మద్దతు ఉంటుందని అభివృద్ధిలో తన సహకారం అన్ని విధాల అందిస్తానని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఆర్‌పురం కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటి అధ్యక్షులు ఎస్.కె యూసుఫుద్దీన్, ఉపాధ్యక్షులు ఆయిలయ్య, ప్రధాన కార్యదర్శి ఎమ్.డి ఇమాంగౌరి, కోశాధికారి సత్యనారాయణ, కమిటి సభ్యులు ఎమ్.ఎ.రెహ్మాన్, సి.ఎస్.రామ్‌మోహన్‌రావు, అక్తర్ సుల్తానా, బోరబండ డివిజన్ నాయకులు ఫయాజ్‌ఖాన్, విజయ్‌సింహారెడ్డి, ఖదీర్, ముక్రం, జె.ఎల్ మేరీ, సునీల్, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

### సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కోసం బిజెపి ధర్నా

**అల్వాల్, జూన్ 27 ప్రభాతవార్త:** అల్వాల్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి నేతలు గురువారం ఆందోళనకు దిగారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బిసి మోర్చా జిల్లా మాజీ అధ్యక్షుడు దండుగుల వెంకటేష్ నేతృత్వంలో ధర్నా చేయడం జరిగింది. అల్వాల్ మండలంగా ఏర్పడి పది సంత్సరాలు దాటుతున్నా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం స్థానికంగా ఏర్పాటు చేయలేదని వెంకటేష్ తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయన్నారు. సికింద్రాబాద్ బేగంపేట్‌లో 13 కిలోమీటర్లు దూరంలో అదీ హైదరాబాద్ జిల్లా పరిధిలో రిజిస్ట్రేషన్ కార్యాలయం ఉందని తెలిపారు. అల్వాల్ ప్రాంతానికి చెందిన 95 శాతం దస్తావేజలు రిజిస్ట్రేషన్‌లు అక్కడ జరుగుతాయని పేర్కొన్నారు. తక్షణం రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని అల్వాల్‌లో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉప తహసీల్దార్‌కు బిజెపి నేతలు వినతి పత్రం అందించారు.

## పాత నేరసుడు అరెస్ట్



పాతనేరస్థుడిన్ని అరెస్ట్ చేసిన సుల్తాన్ బజార్ పోలీసులు

**బేగంబజార్ జూన్27, ప్రభాతవార్త:** దారి దోపిడి కేసులో ప్రధాన నిందితుడైన నాగరాజును సుల్తాన్‌బజార్ పోలీసులుఅరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్స్పెక్టర్ శ్రీనివాస్‌చారి కలిసి సుల్తాన్‌బజార్ ఎసిపి ఎం.శంకర్ మాట్లాడుతూ గతనెల19వ తేదిన మందులను కొనుగోలు చేసేందుకు టిబి వ్యాధిగ్రస్థుడు మహమ్మద్‌ఫిరోజ్(27) వెళ్తుండగా,రంగమహాల్ చౌరస్తాదారికాచి నిజామాబాద్ నాగరాజ్,షానావాజ్,,సిద్దుదంఘర్‌లు మహ్మద్‌ఫిరోజ్‌ను కొట్టి అతనివద్ద ఉన్న 8వేల 500రూపాయల నగదుతోపాటు సెల్‌ఫోన్ తీసుకుని ఉడాయించారు. ఈదోపిడి కేసులో గత నెల25వ తేదిన ఇద్దరిని అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న నాగరాజ్‌ను ఆంధ్రబ్యాంకు చౌరస్తా వద్ద గుర్తించి పట్టుకునిస్టేషన్‌కు తీసుకువచ్చారు. అతని వద్ద సెల్‌ఫోన్‌తోపాటు 2500 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. నాగరాజుపై అఫ్జల్‌గంజ్, మలక్‌పేట్ పోలీస్‌స్టేషన్‌ల్లో6 కేసులు ఉన్నట్లు ఎసిపి శంకర్ వివరించారు. దారిదోపిడి చేధించినక్రైమ్ సిబ్బంది సందీప్,సాయిలు,రవీందర్,చైతన్యలను ఎసిపి శంకర్,సిఐ శ్రీనివాస్‌చారిలు అభినందించారు. ఈకేసును సుల్తాన్ బజార్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## ఎమ్మెల్యే ఐలయ్యకు క్యాబినెట్‌లో మంత్రి పదవీ ఇవ్వాలి

**కొడంగల్ రూరల్, జూన్ 27 (ప్రభాత వార్త)**: ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు రాష్ట్ర క్యాబినెట్‌లో మంత్రి పదవీ ఇవ్వాలని వికారాబాద్ జిల్లా కురుమ సంఘం కార్యదర్శి ఆర్.నాగప్ప, మాజీ ఎంపీపీ నర్సిములు, దస్తప్ప, కురుమ దస్తప్ప, మల్లప్ప, రాంచందర్, భాస్కర్, నర్సిములు, బాల్‌రాజ్, వెంకటయ్య, మధు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షలకు పైగా జనాభా ఉన్నారని, బీసీల ముద్దు బిడ్డ బీర్ల ఐలయ్యకు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి పదవీతో అవకాశం కల్పించాలని కోరారు. కురుమ సామాజిక వర్గానికి చెందిన బీర్ల ఐలయ్య గత అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచారని గుర్తు చేశారు. అదే విధంగా కురుమలకు ప్రత్యేక కార్పోరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## మేము ఎవరిపై దౌర్జనం చేయలేదు

### భూమిని కాపాడుకునేందుకు లీగల్‌గా వెళ్తున్నాం

### భూమి యజమాని సిహెచ్ పుల్లారెడ్డి వెల్లడి

**మొయినాబాద్, జూన్ 27 (ప్రభాత వార్త)**: తాము ఎవరిపై దౌర్జన్యం చేయలేదని మా పట్టా భూమిని కాపాడుకునేందుకు కోర్టులో పిటిషన్ వేశామని భూమి యజమాని సిహెచ్ పుల్లారెడ్డి రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎన్కేపల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 196 బై ఎఎ బై 1లో 35 గుంటల భూమి తమకు ఉందని ధరణిలో కూడా తమ పేరు ఉందన్నారు. ఎన్కేపల్లి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దౌర్జన్యం చేసి భూమి లాక్కునేందుకు ప్రయత్నం చేస్తున్నామని పత్రికలో తప్పుడు సమాచారంతో వార్తలు రాయించుకున్నారని, కోర్టు ద్వారా తమ భూమిని తీసుకునేందుకు లీగల్‌గా వెళ్తున్నామన్నారు. ఈ భూమికి సంబంధించి కోర్టు కేసు నెంబర్ (132ఆఫ్ 2023) రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో సీనియర్ జడ్జి పరిధిలో పెండింగ్‌లో ఉందన్నారు. రెవెన్యూ అధికారులు భూమికి సంబంధించిన పత్రాలను పరిశీలించి న్యాయం చేయాలని భూ యజమాని కోరారు.

## ప్రభుత్వ బడుల్లో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



**మొయినాబాద్, జూన్ 27 (ప్రభాత వార్త)**: ప్రభుత్వ బడుల్లో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భవిష్యత్తులో గొప్పగొప్ప చదువులు చదవాలని చదువు చెప్పిన గురువులు చదివించిన తల్లిదండ్రులకు, పుట్టిన ఊరుకు గొప్ప పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని మాణిక్‌రావు అన్నారు. గురువారం మొయినాబాద్ మండలంలోని శ్రీరామ్ నగర్ గ్రామంలో ఉన్నటువంటి యూపిఎస్సీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రామ్‌రెడ్డి స్కూల్ ప్రిన్సిపాల్ సి జంగయ్య ప్రవీణ్ కుమార్ ఉమాదేవి అలివేలు డాక్టర్ అనంతయ్య పాల్గొన్నారు.

## వర్షాలు కురువాలని పూజలు



నాగర్‌గూడలో కప్పలతో ఇంటింటికి తిరుగుతున్న మహిళలు

**షాబాద్, జూన్ 27, ప్రభాతవార్త** : వర్షాలు కురువాలని మండల పరిధిలోని తాళ్లపల్లిలో గ్రామస్థులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగర్‌గూడలో కప్పలను కర్రకు కట్టి ఇంటింటికి తిరిగారు. ఈసందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ....దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు, తుకాలు పోసేందుకు వానల కోసం ఎదురుచూస్తున్నామన్నారు. వర్షాలు పడి పాడి పంటలు పండాలని వరుణదేవుని వేడుకున్నామన్నారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## వార్షికోత్సవ పూజలు..భక్తులకు అన్నదానం

**ఘట్‌కేసర్, జూన్ 27, ప్రభాతవార్త**: ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లో శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయం లో ప్రధమ వార్షికోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి అర్చకులు, ధర్మకర్తలు ప్రతిష్ట చేసిన విగ్రహాలకు అభిషేకాలు చేసి ప్రవచనాలను చేశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి, అమ్మవారిని దర్శిం చుకొని ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి, అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించి అభిషేకం చేశారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన గావించి సంవత్సరం గడుస్తున్న సందర్భంగా ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో వార్షికోత్సవ పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించగా భక్తులు వచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## నర్సారెడ్డితోనే కాంగ్రెస్ పార్టీ బలోపేతం



వేం నరేందర్‌రెడ్డితో గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు

**గజ్వేల్, జూన్ 27 (ప్రభాతవార్త)**: గజ్వేల్ నియోజకవర్గంలో కొందరు పనికట్టుకొని కాంగ్రెస్ పార్టీకి నష్టం చేసే విధంగా ప్రయత్నాలు చేస్తున్నా రని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ గురువారం ప్రభుత్వ సలహాదా రుడు వేం నరేందర్‌రెడ్డిని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కలి శారు. అనంతరం గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యం లోనే గజ్వేల్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందన్నారు. కొంతమంది కావాలనే నర్సారెడ్డిపై సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం పంపిస్తు న్నారని, అలాంటి వారిపై కాంగ్రెస్ అధిష్టానం చర్యలు తీసుకోవాలన్నారు. తూంకుంట నర్సారెడ్డి ప్రజల్లో మమేకమైన వ్యక్తి అని, అతనిపై విమర్శలు చేయడం సరైంది కాదన్నారు. ఒకరిద్దరునాయకులు హైద్రాబాద్‌లో ఉంటూ వారి స్వలాభం కోసం గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుల మధ్య చిచ్చు పెడుతున్నారని, ఎన్నడూ నియోజకవర్గ ప్రజల మధ్య కనబడని వ్యక్తి ఇలాంటి కార్యక్రమాలకు వత్తాసు పలుకుతున్నాడన్నారు. అనంతరం గజ్వేల్ మార్కెట్ కమిటీ కార్యవర్గం కోసం పేర్ల జాబితాను వేం నరేందర్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి, నరేందర్‌రెడ్డి, గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, సర్దార్‌ఖాన్, మేదినిపూర్ శ్రీనివాస్‌రెడ్డి, జకీర్, సురేష్‌తో పాటువివిధ మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### షుర్ ధడక్నెదో కాంపెయిన్ ప్రారంభించిన ఎవాస్

భారతదేశపు ప్రముఖ నిర్మాణ సామగ్రి కంపెనీ అయిన ఇన్ఫ్రామార్కెట్ తన డైరెక్ట్-టు కన్సూమర్ బ్రాండ్ ద్వారా షుర్ ధడక్నెదో కంపెయిన్ ప్రారంభిం చినట్లు ప్రకటించింది. గృహిణులు వారి గృహాల మధ్య వేళ్లానుకున్న బలమైన సంబంధం సారాన్ని గురిస్తూ మనలాగే మన ఇళ్లు కూడా శ్వాసిస్తాయని జీవిస్తాయన్న వాస్తవాన్ని ఈ కాంపెయిన్ వేడుకచేస్తోంది.



## రుణమాఫీకి ఆమోదం తెలిపిన సిఎంకు కృతజ్ఞతలు

### జాతీయ రహదారిపై ప్లై ఓవర్ల ఏర్పాటు శుభపరిణామం

**నందిగామ, జూన్ 27, ప్రభాతవార్త** బైపాస్ రహదారిలో రోడ్డు ప్రమాదాల నివారణకై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రధాన ముఖ్య కూడళ్ల వద్ద ప్లైఓవర్ నిర్మాణాల ఏర్పాటు శుభ పరిణామం అని నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నరిసింహులు నందిగామ ఎంపిటిసి-3 దేపల్లె కుమారస్వామిగౌలు అన్నారు. మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో జాతీయ ప్రధాన రహదారిపై ఏడు ప్లై ఓవర్ వంతెనలు నిర్మించేందుకు నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. ప్లైఓవర్ వంతెనల వల్ల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు.

### రుణమాఫీకి ఆమోదం తెలిపిన సిఎంకు కృతజ్ఞతలు

పంట రుణాలపై అప్పు తీసుకున్న రైతులకు రెండు లక్షల రుణమాఫీకి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్యాబినెట్ సమా వేశం ఏర్పాటు చేసి ఆమోదం తెలపడం హర్షనీయమని కాంగ్రెస్ యువనేత ముడవత్ గబ్రు చౌహాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో నవపేట రవీందర్‌గౌడ్ కృష్ణగౌడ్ టైలర్ కృష్ణ తుమ్మల బుచ్చయ్య యాదవులు ఉన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కౌన్సిలర్ సంగీత ప్రభాకర్‌రెడ్డి

**ఘట్‌కేసర్, జూన్ 27, ప్రభాతవార్త**: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఘట్‌కేసర్ మున్సిపల్ కౌన్సిలర్ బొక్క సంగీత ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ పురపాలక సంఘం పరిధిలోని 1వ వార్డు ఎన్ఎఫ్‌సీనగర్‌లో గురువారం కామినేని ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా రక్తపోటు, మధుమేహం, సాధారణ పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. మున్సిపల్ 3వ వార్డు కౌన్సిలర్ బొక్క సంగీత ప్రభాకర్‌రెడ్డి విచ్చేసి శిభిరాన్ని సందర్శించి రోగులతో మాట్లాడుతూ కామినేని ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, మాజీ సర్పంచ్ మెడబోయిన వెంకటేశ్, నాయకులు బుస్స రవి, బొక్క సుధాకర్‌రెడ్డి, బొక్క సత్తిరెడ్డి, బొక్క నర్సింహ్మారెడ్డి, ఆకుల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న ఆర్టీసీ కళాజాత ప్రదర్శన

**కొడంగల్,జూన్ 27ప్రభాతవార్త** ఆర్టీసీలో ప్రయణం ఎంతో సురక్షితమని తాండూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సమత అన్నారు.గురువారం కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్‌లో కళాజాత బృంధం నిర్వహించిన కళాజాత ప్రదర్శన ప్రయాణి కులను ఎంతగానో ఆకట్టుకుంది.ప్రయాణికులకు ఆర్టీసీ కల్పిస్తున్న అవకాశాలు,ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తే చేకూరే లాభాలు,సురక్షిత ప్రయాణం తదితర అంశాలపై కళాజాత బృంధం సభ్యులు ఆటాపాటలతో అలరించారు.అనంతరం తాండూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సమత మాట్లాడుతు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ప్రయాణికులకు ఎంతో సురక్షితమన్నారు.ప్రయాణికుల సౌకర్యార్ధం ఆర్టీసీ మహిళలు, విదా ర్యర్ధులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నదని అన్నారు.అంతేగాక ఆర్టీసీ బస్సుల్లో వికాలాంగులకు టికెట్‌పై రాయితీ,ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల భద్రత ఉంటుందన్నారు.ఇందుకుగాను ఆర్టీసీ బస్సుల్లో ప్రయా ణిస్తు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని అన్నారు.కార్యక్రమంలో తాండూర్ డిపో అసిస్టెంట్ మేనేజర్ నిర్మల,కంట్రోలర్ హన్మంత్‌చారీ తదిత రులు పాల్గొన్నారు.

### దొడ్డికొమురయ్య సినిమా నిర్మాణ సమావేశానికి హాజరవ్వండి

**దోమ, జున్ 27, ప్రభాతవార్త** ఈ నెల 29 న వికారాబాద్ జిల్లా కేంద్రములో దొడ్డి కొమురయ్య సినిమా నిర్మాణ సన్నాహక సమావేశానికి అన్ని కుల సంఘాలు హాజరుకావా లని వికారాబాద్ జిల్లా దొడ్డికొమురయ్య సినిమా నిర్మాణ కమిటి కో కన్వీనర్ పోరాటాల రామన్న తెలిపారు.ఈ సంర్బ ముగ ఆయన మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య భూమికోసం, భుక్తి కోసం,వెట్టిచాకిరి విముక్తి కోసం,తెలంగాణ ప్రజల స్వేచ్ఛ స్వాతంత్ర్యం కోసం,తెలంగాణా రైతాంగ సాయుదపో రాట తొలి అమరుడు మహానాయుడని అన్నారు.అందుకు ఆయన సినిమా నిర్మాణానికి సహనిర్మాతల సమావేశానికి అందరు హాజరుకావాలని కోరారు.

### బాధితులను పరామర్శించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



మాణిక్యరెడ్డి అరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న హరీష్‌రావు

**చిన్నకోడూరు/సిద్దిపేట అర్బన్, జూన్ 27, ప్రభాతవార్త**: సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన విద్యుత్‌శాఖ విశ్రాంత ఉద్యోగి కృష్ణారెడ్డి భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అలాగే చిన్నకోడూరు ఎంపిపి కూర మాణిక్యరెడ్డి ఇంట్లో కాలుజారి పడి చికిత్స తీసుకున్న గోనెపల్లి గ్రామంలోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటుండగా హరీష్‌రావు పరామర్శించి సంఘటన జరిగిన తీరు అరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు కొండం సంపత్‌రెడ్డి, మేర సత్తయ్య, మెరుగు మహేష్ తదితరులు ఉన్నారు.

## కిక్ బాక్సింగ్ చాంపియన్‌ను సన్మానించిన ఎస్‌పి



రఘువంశీని సన్మానించి అభినందిస్తున్న ఎస్‌పి రూపేష్ చెన్నూరి

**సంగారెడ్డి టౌన్, జూన్ 27, ప్రభాతవార్త**: మహారాష్ట్రలోని పూణేలోని ఛత్రపతి శివాజీ స్టేడియంలో నిర్వహించిన ఆల్ ఇండియా కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ చాటి చాంపియన్‌గా నిలిచిన హోమ్ గార్డు తనయుడు రఘువంశీని గురువారం జిల్లా ఎస్‌పి సిహెచ్ రూపేష్ చెన్నూరి సన్మానించి అభినందించారు. చాంపియన్ షిప్ టొర్నమెంట్‌లో బారత దేశంలోని 27 రాష్ట్రాలకు చెందిన బాక్సర్లు పోటీ పడ్డారని, పోటీల్లో తన తనయుడు రఘువంశీ విజేతగా నిలివడం అభినందనీయమని జిల్లా ఎస్‌పి రూపేష్ చెన్నూరి అన్నారు. రఘువంశీ తండ్రి ముత్యం ప్రత్యేక చొరవ తీసుకుని తన విధు లను అంకిత భావంతో నిర్వహిస్తూ తన కుమారుడిని కిక్స్ బాక్సర్‌గా తీర్ది దిద్దారని తండ్రి ముత్యంను ఎస్‌పి కొనియాడారు. చాంపియన్‌గా నిలిచిన రఘువంశీ సంగారెడ్డిలోని అక్షర పాఠశాలలో 6వ తరగతిలో విద్యను అందుకుంటూ పట్టణంలోని వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి నందు మాస్టర్ పోచయ్య వద్ద 2 సంవత్సరాలుగా శిక్షణ అందుకున్నట్లు ఎస్‌పి పేర్కొన్నారు. రఘువంశీ చాంపియన్‌గా నిలిచేందుకు విద్యార్థి కృషితో పాటు తండ్రి ముత్యం, మాస్టర్ పోచయ్య ప్రోత్సాహం అభినందనీయమని కొనియాడారు.

## చౌదరిగూడ ప్రత్యేకాధికారిగా మండల అధికారిని నియమించాలి

### -జిల్లా కలెక్టర్‌కు మాజీ సర్పంచ్ రమాదేవి వినతి

**ఘట్‌కేసర్, జూన్ 27, ప్రభాతవార్త**: ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ గ్రామపంచాయతీకి మండల స్థాయి అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించాలని మాజీ సర్పంచ భైరు రమాదేవి రాములుగౌడ్ గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ ప్రత్యేకాధికారిగా కొనసాగుతున్న డీపీఓ ప్రజలకు అందుబాటులో ఉండకుండా సమస్యలను పరిష్కారం చేయడం లేదన్నారు. మక్త, వెంకటసాయి ప్రేమ్‌నగర్, శ్రీరామాలయం కాలనీ, స్వర్ణగిరికాలనీ, బృందావన్ కాలనీలో డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ సమస్యలపై పలుసార్లు ఫిర్యా దులు అందజేసినా ఏలాంటి పనులు చేయడం లేదన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి జోడిమెట్ల, యాదాద్రినగర్, స్వర్ణగిరి, శ్రీవెంకటేశ్వరకాలనీల్లో వరద నీరు వచ్చి చేరుతుందని తెలిపారు. ప్రత్యేకాధికారి-డిపిఓ ఒక్క రోజు కూడా గ్రామపంచాయతీల్లో అందుబాటులో ఉండటం లేదని, ఆయన వినతి అందజేసినా ఏలాంటి చర్యలు చేపట్టడం లేదని పేర్కొన్నారు. జిల్లా స్థాయి అధికారి కాకుండా మండల స్థాయి అధికారిని చౌదరిగూడ ప్రత్యేకాధికారిగా నియమించాలని మాజీ సర్పంచ్ రమాదేవి రాములుగౌడ్ విజ్ఞప్తి చేశారు.

## సీఎం సహకారంతో ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి

### అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేస్తున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే యాదయ్య

**నవాబుపేట్, జూన్ 27, ప్రభాతవార్త**: సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా చేవెళ్ళ నియోజకవర్గం పరిధిలోని నవాబుపేట మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణి కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యతిథిగా పాల్గొని మాట్లాడుతూ సీఎం ఈ జిల్లాకు సంబంధించిన వ్యక్తి అని, ఆయన సారథ్యంలో అభివృద్ధి సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే తగిన ప్రణాళికలు రూపొందించే పనిలో ఉన్నామని అన్నారు. త్వరలో ప్రభుత్వం ప్రకటించిన విధంగా చెక్కులతో పాటు బంగారం అందించే విధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ, నియోజకవర్గం పరిధిలో పరిశ్రమల ఏర్పాటుకు అ న్వైన స్థలాలు ఉన్నాయని, అందుకోసం కృషి చేయాలని అన్నారు. ప్రస్తుతం మండల పరిధిలోని ఆర్కతలలో కొనసాగుతున్న పారిశ్రామిక అభివృద్ధి పనులను కొనసాగిస్తూ పరిశ్రమల ఏర్పాటు చేయించాలని కోరారు. అదేవిధంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు.

### అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే.. సముదాయించిన స్పీకర్

అధికార పరమైన కార్యక్రమం చెక్కుల పంపిణి కోసం ఏర్పాటు చేసిన ప్లెక్సీలు కాంగ్రెస్ పార్టీ నాయకులతో నిండి పోయి ఉన్నాయని అన్నారు. సమావేశం ప్రాంగాణం పార్టీ కార్యక్రమాన్ని తలపిస్తుందని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం పట్ల అధికారులు ఉదాసీనత కనబరచడం విడ్డురమని ఆయన సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటి పొరపాట్లను సహించేది లేదని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఆయన కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు చెప్పడంతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ కలగ చేసుకుని ఎమ్మెల్యేను సముదాయించారు. మరోసారి ఇలాంటి పొరపాటు జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వాసు, తహసీల్దార్ జయరాం, ఎంపీడీవో అనురాధ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జీ భీంభరత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మోమిన్‌పేట్‌లో కళ్యాణలక్ష్మీ,షాదీముబారక్ చెక్కుల పంపిణీ



**కోట్‌పల్లి ,జూన్ 27,ప్రభాతవార్త;** కళ్యాణాలక్ష్మి, షాధిముభారక్, పథకాలను పేదలకు వరంలాంటిదని తెలంగాణ రాష్ట్ర సభాపతి వికారాబాద్ శాసన సభ్యులు గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం నాడు మోమిన్‌పేట్ మండల కేంద్రంలో కళ్యాణాలక్ష్మి పథకం, షాధిముభారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందే విధంగా చూస్తామన్నారు.రైతుల కోసం ఏకకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ, 2 లక్షలు మాఫీ చేయడం జరుగుతుందన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజలను రైతులను మభ్యపెట్టి మోసం చేయడం జరిగిందన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ పేదల కోసం పని చేయడం జరుగుతుందని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని అయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు నరోత్తంరెడ్డి పాల్గోన్నారు,

### జీలుగ, జనుము వేయడంవల్ల భూమి సారవంతమవుతుంది : ఏడిఎ సంధ్యరాణి

**నర్సాపూర్ జూన్ 27. ప్రభాతవార్త** : రైతులు పొలాల్లో జీలుగ,జనుము వేయడం వల్ల భూములు సారవంతమవడమే కాకుండా అధిక దిగుబడులు వస్తాయని ఏడిఎ సంధ్యరాణి అన్నారు. గురువారం నర్సాపూర్ మండలం రుస్తుంపేట గ్రామంలో రైతులు వేసిన జీలుగ పంట పొలాలను ఆమె పరిశీలించి పచ్చిరొట్టె ఎరువుల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు.ఈ సందర్బంగా ఏడిఎ సంధ్యరాణి మాట్లాడుతూ రైతులు పూత దశలో ఉన్న జీలుగను పొలంలోనే రోటావేటర్ సహాయంతో కలియదున్నాలని అన్నారు. జీలుగ దున్నిన తర్వాత 100 కిలోల సింగిల్ సూపర్‌ఫాస్పెట్ దుక్కిలో వేయడం ద్వార మొక్కల అవశేషాలుపంటపొలంలో కుళ్ళి పచ్చిరొట్టె ఎరువుగా తయారవుతుందని సూచించారు.జీలుగ జనుము వేయడం వల్ల భూమి సారవంతమవ్వడమే కాకుండా పంట దిగుబడి పెరుగుతందని అన్నారు .కాగా ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వరి , పత్తి పంటల్లో తీసుకోవల్సిన యాజమాన్య పద్దతుల గురించి రైతులకు తెలియజెప్పడం జరిగింది.అంతేగాక వరి నారు మడులలో తీసుకోవల్సిన సస్య రక్షణ చర్యల గురించి రైతులకు వివరించడం జరిగింది. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దీపిక,ఏఈవో చంద్రవేణి , రైతులు పాల్గొన్నారు.





యువజన సర్వే పాల్గొన్న డివైఎఫ్ఐ నాయకులు

## జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలను భర్తీ చేయాలి

### డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్

**యాచారం జూన్27,ప్రభాతవార్త** : రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటించి వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం యాచారం మండలం మంథన్ గౌరెల్లి గ్రామంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆధ్వర్యంలో యువజన సర్వే నిర్వహించడం జరిగింది.ఈ సర్వే కార్యక్రమానికి హాజరైన డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్ మాట్లాడుతూ....కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలండర్ ప్రకటించి ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఎన్నికల హామీ ప్రకారం జాబ్ క్యాలెండరన ప్రకటించి ఆయా శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు అన్నింటికి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జగన్ ,జిల్లా ఉపాధ్యక్షుడు అలంపల్లి జంగయ్య, చందునాయక్,వినోద్ ,కిరణ్,తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లిలో న్యాయ విజ్ఞాన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

**యాచారం జూన్27,ప్రభాతవార్త** : యాచారం మండలంలోని మేడిపల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి శ్రీ దేవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు... మానవ అక్రమ రవాణా అనేది బలవంతం ,బెదిరింపు లేదా బలవంతం వంటి మార్గాలను ఉపయోగించి వ్యక్తులను రవాణా చేయడం ,రిక్రూట్ చేయడం బదిలీ చేయడం,ఆశ్రయం కల్పించడం స్వీకరించడం వంటివి కలిగి ఉంటుంది.ఈ చర్యలు,సాధనాల యొక్క అంతిమ ప్రయోజనం ఈ వ్యక్తులను దోపిడి ప్రయోజనం కోసం ఉపయోగించడం ఈ వ్యక్తుల దోపిడి వ్యభిచారం అవయవ వ్యాపారం,లైంగిక దోపిడి,బలవంతపు శ్రమ బానిసత్వం వంటి వివిధ అత్యంత అవమానకరమైన రూపాలను తీసుకుంటుంది.మానవ అక్రమ రవానా యొక్క ముప్పు చాలా పెద్దది,అటువంటి నేరాలను నిరోధించడమే కాకుండా పునరావాసం ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాల్సిన అవసరం ఉందని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్ రెడినడ,ఎంపిటిసి శివలిల, స్వరూప, మేడిపల్లి ఎస్ఐ కిషన్,ప్యారా లీగల్ వాలంటీర్లు కృష్ణ, అబ్బయ్య,పప్పి,సబితా ,తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాల లైబ్రరీకి సొంత ఖర్చులతో స్వాతంత్ర సమరయోధుల

## జాతీయ నాయకుల పుస్తకాలు అందజేత



**తలకొండపల్లి,జూన్27,ప్రభాతవార్త** : ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జనుకుంట్ల భాస్కర్ ఆధ్వర్యంలో తలకొంపల్లి ప్రభుత్వ పాఠశాలలో 80 స్వాతంత్ర సమరయోధులు జాతీయ నాయకుల పుస్తకాలను పాఠశాల లైబ్రరీకి సొంత ఖర్చులతో అందించారు. ఈ పుస్తకాలు విద్యార్థుల లోపలసామాజిక స్పృహను దేశభక్తిని పెంపొందిస్తాయని అందుకే ఈ పుస్తకాలను అందించడానికి ముందుకు వచ్చామని భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జాతీయ కోశా ధికారి మ్యాథరి బలరాం వర్కింగ్ ప్రెసిడెంట్ సిబి వెంకటేష్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి ఉప్పల నరసింహ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి వినోద్ జిల్లా సలహాదారులు నాగిళ్ల రమేష్ ఎంగి రాజు మల్లేష్ నూకం శివ ఈసారి శ్రీకాంత్ దేవేందర్ మనో హర్ శీను భరత్ మల్లేష్ రామకృష్ణ శ్రీశైలం రామలింగం తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోలీసులు, విద్యార్థుల ర్యాలీ

**ఘట్‌కేసర్, జూన్ 27, ప్రభాతవార్త**: మాదక ద్రవ్యాల వినియోగం, సరఫరా చేసే వారికి కఠిన శిక్షలు ఉంటాయని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ సైదులు అన్నారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ జరిపారు. ఘట్‌కేసర్ పోలీసులు, కొండాపూర్ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో బైపాస్ రహదారి, యంనంపేట్ చౌరస్తా నుంచి శివారెడ్డిగూడ వరకు ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేస్తూ ర్యాలీ జరిపారు. యువతకు డ్రగ్స్‌కు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సీఐ సూచించారు. ఎస్ఐ రామునాయక్, విజ్ఞాన్ కళాశాల సమన్వయకర్తలు శ్రీలత, కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తా

### న్యాయవాది, బిజెపి మండల ఉపాధ్యక్షులు గౌండ్ల కృష్ణగౌడ్



పాఠశాలకు ఫ్రింటర్‌ను అందజేస్తున్న న్యాయవాది కృష్ణగౌడ్

**చేవెళ్ల, జూన్ 27 ప్రభాతవార్త** : విద్యాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని న్యాయవాది, బిజెపి మండల ఉపాధ్యక్షులు గౌండ్ల కృష్ణగౌడ్ అన్నారు. గురువారం చేవెళ్ల మండల పరిధిలోని కందవాడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు ఫ్రింటర్‌ను ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యార్థులు చదువుతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుని జీవితంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. మన పాఠశాలకు మన గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి మాట్లాడుడూ... పాఠశాల అభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించి మమ్ములను ప్రోత్సహిస్తున్న న్యాయవాది కృష్ణగౌడ్ పాఠశాల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం తదితరులులన్నారు.

### మహిళ భద్రత సాధికారతే లక్ష్యం

మహిళ భద్రత సాధికారతే లక్ష్యంగా శంషాబాద్‌లో భరోసా కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు బిల్డింగ్ బ్లాక్ గ్రూప్ (బిబిజి)చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ 449 టాలెంట్ ఫ్యాక్టరీ కార్యక్రమా నికి తెలంగాణ పోలీస్ డిపార్ట్మెం ట్ మహిళా శిశు భద్రతా విభాగానికి చెం దిన డిసిపి సృజన కర్ణం హాజరయ్యారు. బంగారు తల్లి సాధికారత కల్పించే లక్ష్యంతో బిబిజి నుంచి బిబిజిఫౌండేషన్కు డిసిపి సృజన చేతుల మీదుగా 15 లక్షల చెక్కును అందజేశారు.


చౌటకూరులో దంచి కొడుతున్న వర్షం

## చౌటకూరులో దంచి కొట్టిన వాన

**చౌటకూరు, జూన్ 27, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో గురువారం భారీ వర్షం కురిసింది. 20 రోజుల క్రితం తొలకరి జల్లులు పడటంతో ఖరీఫ్ పంటలను విత్తుకున్న రైతులు వరుణ దేవుడి కరుణ కొరకు ఆకాశం వైపు ఎదురు చూస్తూ బెంగతో కూర్చున్న రైతులకు బుధవారం రాత్రి వర్షం దంచి కొట్టడంతో రైతుల ఆనందానికి అవదులు లేకుండా పోయాయి.

## పదోన్నతిపై వచ్చిన హెచ్‌ఎంకు సన్మానం


పదోన్నతిపై వచ్చిన హెచ్ంఎను సన్మానిస్తున్న దృశ్యం

**చౌటకూరు, జూన్ 27, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతిపై వచ్చిన సుభాష్‌బాబును గురువారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన సుభాష్‌బాబును ఉపాధ్యాయులు, విద్యార్థులు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సుభాష్‌బాబు మాట్లాడుతూ పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ చౌటకూరు, పుల్కల్ మండలాల అధ్యక్షులు యం శ్రీకాంత్, శశిధర్, ఫారుఖ్, గోపికృష్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఇటిక్యాల పాఠశాలను సందర్శించిన డిఈఓ సిఎంఓ


ఎస్ ఇటిక్యాల పాఠశాలను సందర్శించిన డిఈఓ సిఎంఓ

**పుల్కల్, జూన్ 27,ప్రభాతవార్త:** మండలంలోని ఎస్.ఇటిక్యాల గ్రామంలోని పాఠశాలను గురువారం జిల్లా విద్యాధికారి సిఎంఓ, ఎంఓ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాఠశాలను సందర్శించారు. ఎంఎస్ ఇండస్ట్రీస్ యాజమాన్యం, జిల్లా ఇండస్ట్రీస్ అధికారి, జిల్లా లేబర్ అధికారులతో మాట్లాడి పాఠశాలలో ఇది వరకే అడ్మిషన్‌లు పొందిన 24 మంది విద్యార్థులకు భాష అర్థంకాకపోతుండటంతో ప్రత్యేకంగా ఒక విద్యా వలంటీర్‌ను వారం రోజుల్లో ఏర్పాటు చేసి పాఠశాల తరపున మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుందని హామి చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

## గురుకుల పాఠశాలల్లో పదోన్నతులు చేపట్టాలి

-యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కాశీనాథ్‌జాదవ్


మాట్లాడుతున్న కాశీనాథ్ జాదవ్

**నారాయణఖేడ్ టౌన్, జూన్ 27, ప్రభాతవార్త:** సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటి సభ్యులు కాశీనాథ్ జాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నారాయణఖేడ్‌లోని గురుకుల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా కాశీనాథ్‌జాదవ్ మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని, కేర్ టేకర్‌లను నియమించాలని, మౌలిక వసతుల సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపల్ మీర్ అలీ, లెక్చరర్లు భూపాల్‌రెడ్డి, కళ్యాణి, సూర్యారావు, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు పదవీ విరమణ సహజమే


పదవీ విరమణ పొందిన శ్యామలను సన్మానిస్తున్న దృశ్యం

**జహీరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమే అని పిఆర్‌టియు నాయకులు అన్నారు. గురువారం మొగుడంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన శ్యామలకు వీడ్కోలు సమావేశం నిర్వహించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, పిఆర్‌టియు సంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ ప్రభు, జహీరాబాద్ అధ్యక్షులు తులసీ రామ్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, మొగుడంపల్లి అధ్యక్షులు చంద్రు రాథోడ్, ప్రధాన కార్యదర్శి చిట్టి బాబు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు శ్రీదేవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంజనేయులు, నాయకులు బక్కప్రభు, హీరా లాల్ చౌహాన్, పాఠశాల సిబ్బంది ప్రకాష్, జైపాల్, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**నారాయణఖేడ్ టౌన్, జూన్ 27, ప్రభాతవార్త:**
నియోజకవర్గంలోని కంగ్టి, మనూర్, నాగల్‌గిద్ద,నారాయణఖేడ్, నిజాంపేట్, సిర్గాపూర్ మండలాలకు చెందిన 101 మంది కళ్యాణలక్ష్మి లబ్దిదారులకు గురువారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణి చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్దిదారులకు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెక్కులు అందుకున్న, భవిష్యత్తులో అందుకోబోయే లబ్దిదారులు మధ్యదళారులకు ఏ ఒక్క రూపాయి అందించవద్దని సూచించారు.

కళ్యాణ లక్ష్మి కొరకు ధరఖాస్తు చేసుకునే క్రమంలో సైతం రెవిన్యూ అధికారుల లబ్దిదారుల నుంచి నాయ పైసా తీసుకోకుండా సేవలు అందించాలన్నారు. కళ్యాణ లక్ష్మి బోగస్ ధరఖాస్తులు ఉన్నట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చ రించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి, ఆయా మండలాల తహసీల్దార్‌లు, ఆయా మండలాల నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలం కబ్జాకు అక్రమార్కుల యత్నం

-నాలా మూసివేతతో ఇంట్లోకి చెరువు నీరు.. పాట్లు పడుతున్న కాలనీ వాసులు..పట్టించుకోవాలని కాలనీ వాసుల వినతి

**సంగారెడ్డి టౌన్, జూన్ 26, ప్రభాతవార్త:**
ఉన్నతాధికారులు విధులు నిర్వహించే పట్టణ శివారులోని ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు అక్రమార్కులు యత్నిస్తుండటంతో కాలనీ వాసులు నిత్యం అవస్థలు అనుభవిస్తున్నారు. ఆక్రమణను ఆపాలని పలుమార్లు కాలనీ వాసులు సంబంధిత అధికారులకు వినతిచేసినా వారు అక్రమార్కుల నుంచి చేతులు తడుపుకోవడంతో ప్రజల సమస్యలను పట్టించుకోకుండా అటు వైపు కన్నెతి కూడా చూడటం లేదు. ఇదేదో జిల్లాలోని ఏ మారుమూల గ్రామంలో అనుకుంటే పప్పులు కాలేసినట్లే. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... సంగారెడ్డి పట్టణంలోని కల్వకుంట శివారులో నాల్సాబ్ గడ్డ నుంచి కల్వకుంటకు వెళ్లే రోడ్డులో సర్వే నంబర్ 393లో గండి వంతెన వద్ద నాలాను (కుంటను) పూడ్చేసి అక్రమంగా కబ్జా చేసేందుకు కుతంత్రాలు పన్నుతున్నా సంబంధిత అధికారులు అటువైపుగా కన్నెత్తి చూడకపోవడం పట్ల కాలనీ వాసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మహబూబ్ సాగర్ చెరువుకు సమీపంలోని గండి కూలీ పోయే దుస్థితి దాపురించింది. చెరువు,కాలువ మురికినీరు అటుగాగల కాలనీలోని ఇండ్లలోకి చేరుతున్నాయి. ఇండ్లలోకి నీరు చేరుతుండటంతో అంటు వ్యాధులు ఎక్కడ సోకుతాయో అన్న భయంతో కాలనీవాసులు నిత్యం భయాందోళనతో బతుకుతున్నారు. కబ్జా విషయాన్ని స్థానికులు పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా తమకేం పట్టనట్లుగా వ్యవహారిస్తుండటంతో అధికారులు అక్రమార్కుల నుంచి చేతులు తడుపుకున్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణకు గురైన నాలా కుంటను పునరుద్దరించి కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.


సంగారెడ్డి శివారులో నాలాను మూసివేసి కబ్జా చేస్తున్న దృశ్యం


అధికారులు గుర్తించిన ప్రభుత్వ భూమి

## ప్రభుత్వ భూమిగా గుర్తించినా.. హద్దులు నిర్ణయించని రెవెన్యూ అధికారులు

**బెజ్జంకి,జూన్ 27, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని 643 సర్వే నంబరులో గల ప్రభుత్వ భూమిని కొంత మంది ప్రైవేటు వ్యక్తులు కొంత మేరకు కబా ్జచేశారని నెల రోజుల కిందట మండల సీపీఐ నాయకులు నిరసన వ్యక్త ్తం చేసి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అలాగే ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు స ంగెం మధు అధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకు ండా హద్దులు నిర్ణయించాలని ఫిర్యాదు చేసి నెల రోజులు గడుస్తున్న ఇప్పటి వరకు మండల రెవెన్యూ అధికారులు మాత్రం అట్టి ప్రభుత్వ భూమిరి హద్దులు నిర్ణయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్నారని మండల ప్రజలు అంటున్నారు. ఇదిలా ఉండగా గడిచిన కాలంలో డివిజన్ రెవెన్యూ అధికారులు సర్వే నంబరు 643లో ప్రభుత్వ భూమి ఉందని గుర్తించి పంచనామా చేసి హద్దులు నిర్ణయించాలని స్థానిక రెవెన్యూ అధకారులకు సూచించినా ఇప్పటి వరకు హద్దులు నిర్ణయించకపోవడం పై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రభుత్వ భూమికి హద్దులను నిర్ణయించి కబ్జాదారుల నుంచి కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఎల్ఐసి ఉద్యోగుల సంఘం హుస్నాబాద్ అధ్యక్షుడిగా సదాశివరెడ్డి


సమావేశంలో సంఘం సభ్యులు

**హుస్నాబాద్‌టౌన్, జూన్ 17, ప్రభాతవార్త :** ఎల్ఐసి ఉద్యోగుల సంఘం హుస్నాబాద్ శాఖ నూతన అధ్యక్షులుగా పెద్ది సదాశివరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఎల్ఐసి కార్యాలయంలో జరిగిన ఎల్ఐసి ఉద్యోగుల సంఘం, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ హుస్నాబాద్‌శాఖ 29వ వార్షికోత్సవ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి సంఘం కరీంనగర్ డివిజన్ ఉపాధ్యక్షులు రాంమోహన్‌రావు,ప్రధాన కార్యదర్శి వామన్ రావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా నూతన అధ్యక్షునిగా పెద్ది సదాశివరెడ్డి, ఉపాధ్యక్షులుగా ప్రేమ్, సంయుక్త కార్యదర్శులుగా కరుణాకర్,వెంకట్‌రాజ్యం,కోశాధికారిగా వివేక్,జిసి మెంబర్‌గా కిషన్, ఈసిమెంబర్లుగా రాజేంద్రప్రసాద్, అవంతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**హుస్నాబాద్/హుస్నాబాద్‌రూరల్, జూన్27, ప్రభాతవార్త**
హుస్నాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిధి అధ్యాపకులుగా బోదించేందుకు అర్హుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు.విడుదల చేసిన ప్రకటనలో కళాశాలలో బోదించేందుకు హిస్టరీ, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సబ్జెక్టులలో గెస్ట్ ఫ్యాకల్టీల నియామకానికి అర్హులైన పోస్టు గ్రాడ్యుయేట్‌లో ఎస్సి, ఎస్టిలకు 50 శాతం, ఒసి, బిసిలకు 55 శాతం పైన ఉత్తీర్ణతతో పాటు నెట్,సెట్,పిహెచ్‌డి ఇంగ్లీష్,తెలుగు మీడియాలలో బోదన నైపుణ్యం గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక్క సెట్ జిరాక్సు కాపీలు జులై 1వ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోగా కళాశాలలో అందజేయాలని,అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హత గల వారిని ఇంటర్వ్యూకు పిలిచి నియమించడం జరుగుతుందని స్పష్టం చేశారు.


చెత్తబుట్టలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

## హానికరమైన చెత్తపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న

**హుస్నాబాద్, జూన్ 27, ప్రభాతవార్త :** హానికరమైన చెత్తపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సర్ ఆకుల రజితవెంకన్న అన్నారు. గురువారం 15వ వార్డులో జెసిఎల్ ఫౌండేషన్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో తడి, పొడి చెత్త బుట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై సందర్బంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఇళ్లల్లో పరిశుభ్రత పాటించడంతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ఇంట్లోనే తడి, పొడి చెత్తలను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. ఇంట్లో మొక్కలు ఉన్నవారు తడి,పొడి చెత్తలతో వేరు చేసుకుని కంపోస్టు ఎరువు తయారు చేసుకుని వాడుకోవచ్చన్నారు. అంతే కాకుండా నిత్యవసర సరుకుల కోసం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని వాటి స్థానంలో బట్ట సంచులు వాడాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. నిబంధనలు ఉల్లంగించి ఎవరైనా ప్లాస్టిక్ వాడితే వారికి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అంతే కాకుండా ప్రజలు బహిరంగ ప్రదేశాలలో చెత్తను పడేస్తే సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల ప్రకారం జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ అయిలేని అనిత శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ మల్లిఖార్జున్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్ద తండాకు బస్సు సౌకర్యం కల్పించిన మంత్రి

రూట్ పరిశీలించిన డిపో మేనేజరు వెంకటేశ్వర్లు

**అక్కన్నపేట, జూన్ 27, ప్రభాతవార్త :** మండలంలోని పెద్దతండాకు ఆర్టీసి బస్సు లేదని,బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీకి ముఖ్యనేతలు గుగులోతు భాస్కర్‌నాయక్, రాంబాబు నాయక్ హుస్నాబాద్ శాసనసభ్యులు,రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెల్లగా ఈవిషయంపై వెంటనే స్పందించిన మంత్రి గిరిజన తండా అయిన పెద్ద తండాకు వెంటనే బస్సు మంజూరు చేయాలని డిపో మేనేజరు వెంకటేశ్వర్లుకు ఆదేశాలు జారీ చేశారు.ఈ నేపధ్యంలో గురువారం రోజున డిఎం వెంకటేశ్వర్లు కాంగ్రెస్ నాయకులతో కలసి రూట్‌ను పరిశీలించారు.ఈ సందర్బంగా డిఎం మాట్లాడుతూ శుక్రవారం నుండి హుస్నాబాద్ నుండి పెద్దతండాకు మంత్రి ఆదేశాల మేరకు బస్సు నడిపించనున్నట్లు సూచించారు.ఈ విషయం తెలుసుకున్న తండావాసులు మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు డిపో మేనేజర్ వెంకటేశ్వర్లుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ రూట్ పరిశీలించిన వారిలో నాయకులు భాస్కర్‌నాయక్,రాంబాబునాయక్‌లు ఉన్నారు.


రూట్ పరిశీలిస్తున్న డిపో మేనేజరు వెంకటేశ్వర్లు

## యువకుడు అదృశ్యం

**కొల్చారం, జూన్ 27 ప్రభాతవార్త:**
పని కోసం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయిన సంఘటన కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. తుక్కాపూర్ గ్రామానికి చెందిన ఆయిలి రవి (38) ఆరు నెలల క్రితం పని కోసం ఇంటి నంచి వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. ఎక్కడ వెతతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

**గజ్వేల్ టౌన్, జూన్ 27 (ప్రభాతవార్త):**
వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి పేర్కొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 18వ వార్డు భారత్ నగర్ కాలనీలో డ్రై డే కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు దోమల నివారణకై డెమోఫాస్ మందును మురికి కాలువల్లో పిచికారి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అన్నం తినే ముందు చేతులు కడుక్కోవాలని, మన ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో అదేవిధంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల వల్ల మలేరియా, డెంగ్యూ చికున్‌గున్యా, ఫైలేరియా వంటి అనేక సీజనల్ వ్యాధులు ప్రభలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఇంటి పరిసరాల్లో ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, జ్వరము, దద్దుర్లు, వాంతులు, విరేచనాలు, డీహైడ్రేషన్, కాళ్లు, చేతులు లాగడం, చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఐవిఎఫ్ యూత్‌అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్, గజ్వేల్ సబ్ యూనిట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, ధరణికోట నాగరాజు, ఫీల్డ్ వర్కర్ ఎన్.రమేష్, ఆశ వర్కర్లు సంతోష, బి.స్వప్న తదితరులు పాల్గొన్నారు.


భారత్‌నగర్‌లో డెమోఫాస్ మందును మురికికాల్వలో పిచికారి చేపిస్తున్న దృశ్యం

## కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పూర్తిచేయాలి

కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి

**రామచంద్రాపురం, జూన్ 27, ప్రభాతవార్త:** భారతి నగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీలో నిర్మాణ దశలో ఉన్న కమ్యూనిటీ భవనం నిర్మాణం పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి అన్నారు. గురువారం బొంబాయి కాలనీలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ భవనాన్ని కార్పొరేటర్ పరిశీలించారు.ఈ సంర్భంగా కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ 1 కోటి 69లక్షల జిహెచ్‌ఎంసి నిధులతో నిర్మిస్తున్న కమ్యూనిటీ భవనం నాణ్యతపూర్వగా త్వరలో నిర్మించాలని అధికారులకు సూచించారు. బస్తీ వాసులు శుభకార్యాలు కమ్యూనిటీ హాల్‌లో జరుపుకునేలా నిర్మాణం పనులు వెంటనే పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఏఈ చంద్రశేఖర్, ఎన్‌ఎసి ఇంజినీర్ శ్రవణ్, సర్కిల్ యువత అధ్యక్షులు నరసింహ, మైనార్టీ కార్యదర్శి గౌస్, బిఆర్‌ఎస్ నాయకులు కృష్ణగౌడ్, కుతుబుద్దీన్, శ్యామ్, కాంట్రాక్టర్ వెంకట్రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించిన కార్పొరేటర్

**రామచంద్రాపురం, జూన్ 27, ప్రభాతవార్త:** ఓల్డ్ రామచంద్రాపురం 3వ బ్లాక్‌లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజి సమస్యను గురువారం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పరిష్కరించారు. గురువారం జలమండలి అధికారులతో కార్పొరేటర్ సమస్యపై చర్చించి 6.60లక్షల రూపాయల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేయిస్తున్నారు. పనులు చివరి దశలో ఉండటంతో గురువారం కార్పొరేటర్ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. కాలనీ వాసుల వినతి మేరకు కాలనీలో డ్రైనేజి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ హామి చేయడంతో పాటు జలమండలి మేనేజర్ జనార్ధన్‌కు బస్తీ నుంచి ఫోన్‌లో సమస్యను పరిష్కరించాలని సూచించారు. కార్పొరేటర్ వెంట అప్పల భాస్కర్, రాములు యాదవ్, అప్పల జంగయ్య, అప్పల సత్తయ్య, తల్వార్ సత్తి, ప్రభు, కురుమ శ్రీను, మహేందర్ యాదవ్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు పుస్తకాల అందజేత

**చిన్నశంకరంపేట, జూన్ 27,ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండలం దర్పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం హర్ట్‌టూ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు నోటు పుస్తకాలను అందించారు. పాఠశాలలో పది చదువుతున్న 37 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 7నోటు పుస్తకాల చొప్పున వారికి అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, స్వచ్ఛంద సంస్థ చైర్మన్ రవి నాయక్, ఉపాధ్యాయులు రమేష్ చౌదరి, నరేష్‌కుమార్, శ్రీనివాస్, రఘు, జ్యోతి, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వాసవీ క్లబ్ చేయుత

**మునిపల్లి, జూన్ 27, ప్రభాతవార్త:** సదాశివపేట పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో విద్యార్థులకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సామాగ్రిలను పంపిణి చేశారు. విద్యార్థులకు చేయుత అందచేయడం ఆనందంగా ఉందని క్లబ్ బాధ్యులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు బొగ్గరపు శ్రీనివాస్, సంపు శ్రీనివాస్, అనుముల సాయి రాజు, మెర్గుకుంట అశోక్, ర్యాగళ్ల అశోక్, పురం రజిని కృపాకర్, బొగ్గరపు రాజేశ్వరి ఉప్పలంచి ప్రేమ్ కుమార్, ప్రదీప్, నామ భాస్కర్, తంగడపల్లి లక్ష్మణ్, అమరి రాచన్న, తాటికొండ వైద్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిని సత్కరించిన పంజ విజయ్‌కుమార్


ఎంపీ రఘునందన్ రావును సన్మానిస్తున్న జెడ్పిటిసి పంజ విజయ్‌కుమార్

**రామాయంపేట, జూన్ 27, ప్రభాతవార్త :** మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు ఢిల్లీలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం బీజేపీ మెదక్ అసెంబ్లీ ఇంచార్జ్, నిజాంపేట జెడ్పీటీసీ పంజ విజయ్‌కుమార్ మర్యాద పూర్వకంగా ఎంపి రఘునందన్‌రావును కలిసి శాలువ కప్పి అభినందనలు తెలిపారు. పంజ విజయ్‌కుమార్ వెంట బీజేపీ సీనియర్ నాయకులు జె. శంకర్‌గౌడ్, భరత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ


ఎరువుల దాకాణాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

**రామాయంపేట, జూన్ 27, ప్రభాతవార్త :** మెదక్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీమతి విజయనిర్మల గురువారం రామాయంపేటలో పలు ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణతో కలిపి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ ఎరువుల దుకాణాల యజమానులు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలని, ఈ పాస్ మిషన్ల ద్వారా మాత్రమే ఎరువుల విక్రయాలను జరపాలని సూచించారు. అందరూ డీలర్లు తప్పనిసరిగా ఎరువుల నియంత్రణ చట్టం 1985 ప్రకారం నిబంధనలు పాటించాలని, ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ వారికి రిపోర్టులను అందజేయాలని, స్టాక్ రిజిస్టర్‌లను సరిచేసుకోవాలని డీలర్లను ఆదేశించారు. ప్రతి రైతు దగ్గర నుండి ఆధార్ వివరాలు సేకరించి ఈపాస్ మిషన్లో నమోదుచేయాలని, రైతులు ఎరువులు కొనేటప్పుడు తమ ఆధార్ వివరాలను షాపు యజమానులకు అందజేయాలని సూచించడం జరిగింది. ఈ సందర్బంగా మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా యూరియా 444 మెట్రిక్ టన్నులు, డిఏపి 40 మెట్రిక్ టన్నులు, 399 మెట్రిక్ టన్నులు కాంప్లెక్స్ ఎరువులు, 38 మెట్రిక్ టన్నుల పొటాష్ ఎరువులు అందుబాటులో ఉన్నవని తెలిపారు.

## బాలికల కళాశాలలో భేటీ బచావో భేటీ పడావో

**సంగారెడ్డి టౌన్, జూన్ 27, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమాన్ని జిల్లా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాదికారత కేంద్రం (డిహెచ్‌ఈడబ్లు) ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాలలో విద్యను ఆర్జిస్తున్న విద్యార్థులను అవగాహన కల్పించారు. ఆడపిల్ల ప్రాముఖ్యత, చదువు, విద్యా ఉద్యోగం ఆర్థిక అభివృద్ధి చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మానసిక ఒత్తిడిని అదిగమించే పద్దతుల గురించి వివరించారు. భ్రూణ హత్యలను ఆపడానిక, క్షీణిస్తున్న లింగ నిష్పత్తిని అరికట్టడానికి ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ మహిళా సాదికారత కేంద్రం సమన్వయ కర్త పల్లవి, విశాల, కళాశాల సిబ్బంది, 7వందల మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


బాలికల జూనియర్ కళాశాలలో వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం